MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 306 | పేజీలు : 8 | సోమవారం 26 అక్టోబర్ 2026 | వెల : 6-00



ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు

- ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- ప్రపంచ దేశాలు దృఢ సంకల్పంతో ఏకమై దీనిని ఎదిరించాలని పిలుపు
- విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్

5



దిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్


- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- నిపుణుల హెచ్చరికలు
- శీతాకాలం సమీపించిన వేళ, దిల్లీలో మరోసారి కాలుష్యం కోరలు చాస్తోంది
- వాయు నాణ్యత తగ్గిపోయి హానికరగాలులతో దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరవుతోంది.
- ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం

మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

- చెలరేగిన రాజకీయ దుమారం
- దేశవ్యాప్తంగా నిరసనలకు బీజేపీ సిద్ధం!

అర్నబ్ తుఫానుపై అప్రమత్తం

- ఈ నెల 28న బాపట్ల, విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా పనిచేయాలి.. గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలి
- ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలి
- శాటిలైట్ సమాచారం, శాస్త్రీయ డేటా ఆధారంగా చర్యలు చేపట్టాలి



అమరావతి, మహానగర్

అర్నబ్ తుఫాను నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తత, అత్యున్నత సంసిద్ధత, ముందస్తు ప్రణాళికతో అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో పది శాఖలు, జిల్లాల కలెక్టర్లతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రాణనష్టం జరగకుండా, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని, తీర ప్రాంత గ్రామాల ప్రజలు ప్రభుత్వ సూచనలు పాటించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉపగ్రహ సమాచారం, శాస్త్రీయ డేటా ఆధారంగా చర్యలు తీసుకోవాలని, జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ సిద్ధంగా ఉండాలని, సముద్రంలో వేటకు వెళ్లిన బోట్లన్నీ తీరానికి చేరేలా చూడాలని సూచించారు. ఈ వారంలో ప్రసవాలు జరిగే అవకాశం ఉన్న గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని, తాగునీరు, ఆహారం సిద్ధం చేయడంతో పాటు పునరావాస కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ దెబ్బతింటే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారుల వివరాల ప్రకారం, బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుఫానుగా బలపడి ఈ నెల 28 మధ్యాహ్నంలోగా బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. కోనసీమ, యానాం, కాకినాడ - మిగతా 2లో



ఓటును, దేశాన్ని కాపాడుకుందాం

- నవంబర్ 1న భారీ ర్యాలీకి రాహుల్ గాంధీ పిలుపు
- అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు దిల్లీలోనే ఉండాలని పార్టీ ఎంపీలకు మల్లికార్జున ఖర్గే సూచించారు.
- 'ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగిస్తున్నారు
- నిబంధనలను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు
- అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తిన వారిపై లాఠీలతో దాడులు చేశారు.

5

ఏపీ పోర్టులకు దేశంలో 2వ స్థానం



- 2024-25తో పోలిస్తే 12% వృద్ధి
- దేశంలో నాన్-మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో మొదటి స్థానంలో గుజరాత్
- ఏపీ రెండో స్థానంలో ఉంది. 2024-25తో పోలిస్తే ఇది సుమారు 12% ఎక్కువ.
- విశాఖపట్నం పోర్టు నుంచి 2025-26లో 91.17 ఎంఎంటీల సరకు రవాణా జరగ్గా, గత ఆర్థిక సంవత్సరంలో అది 82.62 ఎంఎంటీలుగా ఉంది

అమరావతి, మహానగర్


రాష్ట్రంలోని పోర్టుల ద్వారా 2025-26లో సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా జరిగింది. 2024-25తో పోలిస్తే ఇది సుమారు 12 శాతం ఎక్కువ. దేశంలో నాన్- మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో గుజరాత్ మొదటి స్థానంలో నిలవగా, ఏపీ రెండో స్థానంలో ఉంది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్- డీజీసీఐఎస్' తాజాగా వెల్లడించింది. విశాఖపట్నంలోని - మిగతా 2లో

పోలింగ్‌కు ముందే కూటమి సత్తా

- పలు మున్సిపాలిటీలు ఏకగ్రీవం
- పురపాలికల్లో పోలింగ్‌కు ముందే కూటమి సత్తా చాటింది
- పలు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- టీడీపీ 47, బీజేపీ 2, జనసేన ఒక డివిజన్‌లో ఏకగ్రీవమయ్యాయి
- మేయర్ సహా 16 డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి

అమరావతి, మహానగర్

రాష్ట్రంలో పురపోరులో పోలింగ్‌కు ముందే కూటమి సత్తా చాటింది. పలు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ఈ మేరకు ఏకగ్రీవమైన అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి డిక్లరేషన్ అందుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీని టీడీపీకి కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా నంద్యాల రాఘవరెడ్డితో పాటు తెలుగుదేశానికి చెందిన 52 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారందరికీ మున్సిపల్ కార్యాలయంలో డిక్లరేషన్లు ఇచ్చారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం - మిగతా 2లో



ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

- బ్యాంకింగ్ రంగానికి సైబర్ ముప్పు
- రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయి
- భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది

5

మహానగర్

లోకల్ బాడీ ఎన్నికల్లో పతాక స్థాయికి ఘర్షణలు



కర్నూలు : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల దశలోనే అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను బలవంతంగా లాక్కొని చించేయడం, పరస్పరం దాడులకు దిగడం వంటి ఘటనలు కలవరపెడుతున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటుండటంతో అసలు తప్పు ఎవరిదన్నది తేల్చడం కష్టంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు కూడా ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు చూపిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. అలాంటి ప్రక్రియలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ వర్గీయులు లాక్కొని చించేశారన్న వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. మరోవైపు వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులపైనా దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనల్లో ఎవరు బాధితులు, ఎవరు బాధ్యులు అనే అంశాన్ని రాజకీయ వాదనల ఆధారంగా కాకుండా పూర్తి ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉంది.వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త రామకృష్ణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 76 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ఆ పార్టీ ఆరోపించింది. వీటిలో వైఎస్సార్ కడప జిల్లాలో 22, పల్నాడులో 18, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో కలిపి 11 ఘటనలు ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను టీడీపీ ఖండిస్తోంది. ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ అనవసర వివాదాలు సృష్టిస్తోందని, ఎన్నికలను వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తోందని అధికార పార్టీ నేతలు విమర్శిస్తున్నారు.పెనుకొండ, కడప , చిత్తూరు , శ్రీకాళహస్తి , పులివెందుల వంటి ప్రాంతాల్లో నామినేషన్ల విషయంలో వివాదాలు చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న వీడియోలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. మరోవైపు పుంగనూరు పరిధిలోని సదుం, రాయచోటి, మాచర్ల ప్రాంతాల్లో టీడీపీ నేతలు, అభ్యర్థులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. చిత్తూరులో వాకర్ సాయంతో నామినేషన్ వేసేందుకు వెళుతున్న టీడీపీ మహిళా అభ్యర్థి అరుణకు ఎదురైన పరిస్థితికి సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కర్నూలు, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో వైసీపీ శ్రేణులు టీడీపీ అభ్యర్థులను అడ్డుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో పల్నాడు, మార్కాపురం, తిరుపతి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులకు నామినేషన్ల విషయంలో ఆటంకాలు ఎదురైనట్లు ప్రచారం జరిగింది. కొన్ని ఘటనల్లో వాహనాలు ధ్వంసం కాగా, పోలీసు సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. జనసేన కార్యకర్తలపైనా కొన్ని చోట్ల వైసీపీ అభ్యర్థులను అడ్డుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి.ఈ పరిణామాలతో పోలీసుల వ్యవహారశైలిపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలంగా వ్యవహరించడం లేదని ఇరు పార్టీల నేతలు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నై కొత్తపల్లిలో నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థులను అనుమతించే విషయంలో వివాదం తలెత్తినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో కొందరికి గాయాలైనట్లు కూడా పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు, అధికారిక నిర్ధారణ అవసరం.మొత్తంగా చూస్తే, స్థానిక ఎన్నికలు రాజకీయ ఆధిపత్య పోరుకు వేదికగా మారుతున్నాయి. ఏ పార్టీకి బలం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఏ పార్టీకి చెందిన వారైనా నామినేషన్లను అడ్డుకోవడం, దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమే. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడమే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే మార్గం.

ఎన్నికల వివాదాలకు ఫుల్‌స్టాప్ ఎప్పుడు?



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్యమైన రాజకీయ, చట్టపరమైన సమీకరణాలు వెలుగులోకి వస్తున్నాయి. స్థానిక పోరులో నామినేషన్ల ఘట్టం నుంచి మొదలైన వివాదం ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం వరకు చేరినప్పటికీ.. అధికార కూటమి, పొలిటికల్ సర్కిళ్లలో మరో ఆసక్తికరమైన ప్రచారం నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నామినేషన్లను అడ్డుకున్నారు అనే ప్రచారాన్ని ఉద్దేశపూర్వకంగానే తీవ్రతరం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బహిష్కరణ ప్రకటన వచ్చేలా మానసిక వాతావరణాన్ని సిద్ధం చేసుకుంటోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు సమస్యాత్మక కేంద్రాలు, మున్సిపాలిటీలలో స్థానిక అధికారులు , పోలీసులు తీసుకుంటున్న భద్రతా చర్యలే. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, అనవసర ఘర్షణలను నివారించేందుకు పోలీసులు నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, సంబంధిత అభ్యర్థులు, ప్రతిపాదకులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. అయితే, వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనేతలు తమ అనుచరగణంతో భారీ రాలీలుగా నామినేషన్ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు పోలీసులు అడ్డుకోవడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ, దీన్నే పక్కాగా తమకు అనుకూలంగా మలుచుకుని మా నేతలను పోలీసులు దగ్గరుండి అడ్డుకుంటున్నారు, నామినేషన్లు వేయనివ్వడం లేదు అని వైసీపీ డిజిటల్ స్పేస్‌లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తోందనేది టీడీపీ నేతల ఆరోపణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత వైసీపీ క్షేత్రస్థాయి యంత్రాంగం , ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్రమైన నైరాశ్యంలో కూరుకుపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మిగిలి ఉన్న కొద్దిపాటి ఉనికి కూడా తుడిచిపెట్టుకుపోతుందనే భయం నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో పోటీ చేసి ఓడిపోవడం కంటే.. ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా ఎన్నికలను బహిష్కరించాం అనే నరేటివ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడమే పార్టీ ప్రతిష్టకు క్షేమకరమని వైసీపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు పొలిటికల్ టాక్ నడుస్తోంది. మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియను వీలైనంత వివాదాస్పదం చేయడం ద్వారా తమ బహిష్కరణ నిర్ణయానికి పునాది వేసుకునే ప్రయత్నం సాగుతోందని తెలుస్తోంది. నామినేషన్లలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించడం, ఆరోపణలను మీడియా వేదికగా నిరంతరం పబ్లిసిటీ చేయడం ద్వారా.. ఎన్నికల యంత్రాంగం పోలీసులు కూటమికి కొమ్ముకాస్తున్నారు, ఇలాంటి వాతావరణంలో ఎన్నికలు ప్రహసనంగా మారాయి అనే అభిప్రాయాన్ని బలంగా నాటాలని యత్నిస్తున్నారు. మా అభ్యర్థుల ప్రాణాలకు రక్షణ లేదు, అందుకే మేము ఈ ప్రజాస్వామ్య రహిత ఎన్నికలను బహిష్కరిస్తున్నాం అని బాహాటంగా ప్రకటించడానికి పార్టీకి ఒక బలమైన సాకు దొరుకుతుందని భావిస్తున్నారు.తమకు ప్రజా మద్దతు ఉందని, కానీ అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతూ, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, అభ్యర్థులను భౌతికంగా అడ్డుకోవడం వల్లే తాము న్యాయపోరాటం చేయాల్సి వస్తోందని వారు వాదిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా నామినేషన్ల ప్రక్రియను సమీక్షించి గడువు పెంపును పరిశీలించాలని సూచించడమే తమ ఆరోపణలకు నిదర్శనమని వారు స్పష్టం చేస్తున్నారు. స్థానిక పోరులో సాగుతున్న ఈ యుద్ధం రాబోయే రోజుల్లో మరింత ఆసక్తికరంగా మారనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ , పోలీసులు ఎంతటి పటిష్ట భద్రత కల్పించినా, ఒకవేళ వైసీపీ నిజంగానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తే.. అది రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రగడకు దారితీస్తుంది. నామినేషన్ల గడువు సమీపిస్తున్న కొద్దీ వైసీపీ వ్యూహం బహిష్కరణ వైపా లేక పూర్తిస్థాయి పోరాటం వైపా అనేది తేలిపోనుంది.

అవినీతి అధికారులకు

సెక్రటేరియట్‌లో లాబీయింగ్



హైదరాబాద్ : తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నెలకు సగటున 20 నుంచి 25 కేసుల వరకు నమోదు చేస్తూ లంచగొండి అధికారుల పాలిట సింహస్వప్నంగా మారుతున్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం, అక్రమాస్తుల కేసుల్లో దాడులు జరగడం రోజువారీ వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అయితే, అలా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన అధికారులు ఆ తర్వాత ఏమవుతున్నారు? కోర్టుల్లో శిక్షలు పడుతున్నాయా అంటే.. సచివాలయంలోని కొన్ని విభాగాల మద్దతుతో, చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని విచారణ నుంచి హాయిగా తప్పించుకుంటున్నారనే సంచలన నిజాలు బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ ప్రభుత్వానికి సమర్పించిన న నివేదిక ప్రకారం.. ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేసి సచివాలయానికి ప్రాసిక్యూషన్ అనుమతి కోసం పంపినప్పుడు తీవ్ర ఆలస్యం జరుగుతోంది. ప్రత్యక్షంగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారుల కేసులను కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ఆ తర్వాత వాటిని కోర్టు విచారణ దాకా వెళ్లకుండా, నామమాత్రపు శాఖా పరమైన విచారణ లకు బదిలీ చేసి ఏసీబీ కేసులను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో ఏసీబీ విచారణ అనుమతి కోరిన 22 కేసుల్లో ప్రభుత్వం అనుమతి నిరాకరించి, కేసులను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది.అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఉన్న సెక్షన్ 17ం నిబంధనను ప్రభుత్వ అధికారులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. అయితే దీనిపై అక్టోబర్ 16న స్పందించిన భారత అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అధికారిక విధులు నిర్వహించడంలో తీసుకునే నిర్ణయాలకు మాత్రమే సెక్షన్ 17ం రక్షణ కల్పిస్తుంది. లంచం అడగడం లేదా తీసుకోవడం అనేది ఏ రకంగానూ అధికారిక విధి కిందకు రాదు. కాబట్టి రెడ్ హ్యాండెడ్‌గా లంచం తీసుకుంటూ పట్టుబడే అధికారులను విచారించడానికి ఎలాంటి ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సచివాలయంలో అవినీతి అధికారులను కాపాడుతున్న బలమైన లాబీ కి చెక్ పెట్టాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకులు ఎం. పద్మనాభరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మార్గదర్శ కాల ప్రకారం, లంచం కేసుల్లో పట్టుబడిన అధికారులపై సెక్షన్ 17ం అనుమతి నెపంతో విచారణను నిలిపివేయకుండా ఏసీబీని నేరుగా ప్రాసిక్యూషన్‌కు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సచివాలయమే అవినీతిపరులకు రక్షణ కవచంగా మారితే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

అర్నబ్ తుఫానుపై అప్రమత్తం



-మొదటిపేజీ తరువాయి

తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశాన్ని కూడా అంచనా వేస్తున్నారు. ఈనెల 26 ఉదయానికి తుఫానుగా, అదే రోజు రాత్రికి తీవ్ర తుఫానుగా, 27న అతి తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 115--125 కిలోమీటర్ల వేగంతో, కొన్ని సందర్భాల్లో 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచవచ్చని వివరించారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపారు. ప్రభావిత జిల్లాల్లో సగటున 22--29 సెంటీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తుఫానుపై ప్రతి నాలుగు గంటలకు ఒకసారి బులెటిన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ గుప్తా, జిల్లా కలెక్టర్లు, వ్యవసాయం, విద్యుత్, ఇరిగేషన్, హోం, వైద్య ఆరోగ్య, పౌరసరఫరాలు, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ముందే కూటమి సత్తా

-మొదటిపేజీ తరువాయి

పట్టుదలతో పని చేస్తామని చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న రాఘవరెడ్డి తెలిపారు.

కడప నగరపాలక ఎన్నికల్లో 50 డివిజన్‌లు ఏకగ్రీవమయ్యాయి. టీడీపీ 47, బీజేపీ 2, జనసేన ఒక డివిజన్‌లో ఏకగ్రీవమయ్యాయి. మేయర్ సహా 16 డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. బద్వేల్ మున్సిపల్ పీఠాన్ని తెలుగుదేశం కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్‌గా సోమేసుల దివ్యతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైదుకూరు మున్సిపాలిటీ చైర్మన్ పీఠం టీడీపీ వశమైంది. చైర్మన్‌గా ధనపాల జగన్‌మోహన్ ఏకగ్రీవమయ్యారు. ఆళ్లగడ్డ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా షేక్ అనీషా(టీడీపీ)తో పాటు 32 వార్డులను తెలుగుదేశం కైవసం చేసుకుంది. కమలాపురం నగర పంచాయతీ కూడా టీడీపీ కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్‌గా స్వప్నతో పాటు 22 మంది టీడీపీ, ఒక బీజేపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజంపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా తెలుగుదేశానికి చెందిన దొంతం గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పీఠం బీజేపీ ఖాతాలో పడింది. చైర్‌పర్సన్‌గా గోర్ల మధులత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 27 వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవమయ్యారు. ఎర్రగుంట్లలో ఒక వార్డుకు మాత్రమే ఎన్నిక జరగనుంది. పులివెందుల మున్సిపాలిటీలో 20 వార్డులు టీడీపీ కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్ సహా మరో 20 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి తంగేళ్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాచేపల్లిలో ఛైర్మన్‌తో పాటు 28వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. గురజాల నగర పంచాయతీ ఛైర్మన్‌గా తెలుగుదేశానికి చెందిన నేలవల్లి బొల్లయ్యతో పాటు 23 వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవంగా గెలుపొందారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీపై కూడా టీడీపీ జెండా ఎగిరింది. తెలుగుదేశానికి చెందిన బాబావలి ఛైర్మన్?గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. చిలకలూరిపేట 48 వార్డుల్లో 16 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవం కాగా పురపాలక ఛైర్‌పర్సన్ బరిలో ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు.

ప్రకాశం జిల్లా దర్శి మున్సిపాలిటీ జనసేన కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా దారం సుబ్బారావుతో పాటు 28 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనిగిరి మున్సిపాలిటీపై టీడీపీ జెండా ఎగిరింది. ఛైర్‌పర్సన్‌గా తిరుపతమ్మతో పాటు 30 మంది కౌన్సిలర్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి మున్సిపాలిటీలో 48 వార్డులకు 30 వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 37వ వార్డు కౌన్సిలర్‌గా జేసీ ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. ఆత్మకూరు మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా గోవిందరాజులు(టీడీపీ)తో పాటు 32 వార్డులకు 27 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపాలిటీని తెలుగుదేశం కైవసం చాటింది. రాయచోటి ఛైర్మన్‌గా బోనమల ఖాదర్‌వలి(టీడీపీ)తో పాటు 44 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపాలిటీలోని నాలుగు వార్డుల్లో టీడీపీకి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2 మున్సిపాలిటీలను తెలుగుదేశం కైవసం చేసుకుంది. పుంగనూరు మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ నయామ్‌తాజ్(టీడీపీ) 32 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. నగరి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ సహా 3 వార్డులకు ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎన్నికయ్యారు. నగరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా శ్రీనివాసన్(టీడీపీ) విజయం సాధించారు.చిత్తూరు నగరపాలిక సంస్థ ఎన్నికల్లో 51 డివిజన్లు, కుప్పం మున్సిపాలిటీలో 13 వార్డులను తెలుగుదేశం కైవసం చేసింది.

సరకు రవాణాలో ఏపీ పోర్టులకు దేశంలో 2వ స్థానం

-మొదటిపేజీ తరువాయి

మేజర్ పోర్టు, గంగవరం, కాకినాడ డీప్ వాటర్, కృష్ణపట్నం, కాకినాడ యాంకరేజ్, రవ్వ నాన్-మేజర్ పోర్టుల ద్వారా సరకు రవాణా సామర్థ్యం ఏటా సుమారు 327.5 ఎంఎంటీలుగా ఉంది. ఇందులో 64.12 శాతం మాత్రమే రవాణా చేయడం సాధ్యమైంది. దీన్ని మరింత పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టులను పూర్తి చేయడం ద్వారా దేశంలోని నాన్-మేజర్ ఓడరేవుల కార్గో సామర్థ్యంలో 20 శాతం వాటా సాధించాలని భావిస్తోంది.

సరకు రవాణాలో 10.35% పెరుగుదల

విశాఖపట్నం పోర్టు నుంచి 2025-26లో 91.17 ఎంఎంటీల సరకు రవాణా జరగ్గా, గత ఆర్థిక సంవత్సరంలో అది 82.62 ఎంఎంటీలుగా ఉంది. ఈ ప్రకారం సరకు రవాణాలో 10.35 శాతం పెరుగుదల నమోదైంది. ఇదే వ్యవధిలో రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల ద్వారా 118.83 ఎంఎంటీల సరకు రవాణా జరిగింది. 2024-25లో ఇది 104.32 ఎంఎంటీలుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే కార్గో రవాణా 14.51 ఎంఎంటీలు పెరిగింది. నౌకల టర్న్ ఎరౌండ్ సమయం తగ్గించడం, పోర్టులో సౌకర్యాలు మెరుగు పరచడం కార్గో రవాణా పెరగడానికి కారణమని అధికారులు తెలిపారు.

ఏటా 109 ఎంఎంటీల సరకు రవాణా

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నాలుగు కొత్త పోర్టులను అందుబాటులోకి తేవడం ద్వారా 2026-27లో కార్గో రవాణా సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా ఏపీ మారిటైం పాలసీని రూపొందించింది. రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల మొత్తం సరకు రవాణా సామర్థ్యాన్ని ఏడాదికి 191 ఎంఎంటీల నుంచి 285 ఎంఎంటీలకు పెంచాలన్నదే పాలసీ లక్ష్యం. నాలుగు కొత్త పోర్టుల మొదటి దశ నిర్మాణం పూర్తయితే ఏటా 109 ఎంఎంటీల సరకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జీఎంసీ బాబు

- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ, మహానగర్

పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ సీనియర్ నాయకుడు జీఎంసీ బాబు తన 40 మంది అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం తన కార్యాలయంలో వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీ కేశినేని చిన్ని, మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి 33వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఎన్నికల ప్రచారం, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి స్నేహ, సంతోష్, సీనియర్ టీడీపీ నాయకులు కాజా, కోనేరు కిషోర్, ఎర్నేని వేదవ్యాస్, సల్మాన్, సయ్యద్ భజా, సయ్యద్ అహ్మద్ అలీ, యాహు, షేక్ అస్గర్, బత్తుల కాశీ విశ్వనాథ్, బత్తుల రవీంద్ర, రాఘవేంద్ర ప్రసాద్, బత్తుల ప్రసాద్, బత్తుల పెద్ద కాశీ, సుధీర్, షేక్ సుభాని, షేక్ హమీద్, షేక్ అమానుద్దీన్, చంద్రశేఖర్, సురేష్ బాబు, సయ్యద్ రహమతుల్లా, ఇమ్రాన్, మోసిన్, మోయిన్, శ్యామ్, షబ్బీర్, ఎస్.కే. మున్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం, న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్లపై మహిళలకు అవగాహన



విజయవాడ, మహానగర్:

నేషనల్ సరస్ మేళా 2026లో భాగంగా కన్వర్జెన్స్ పెవిలియన్‌లో కృష్ణా జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పోషకాహార వంటింటి తోటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జి. శ్రీనివాసరావు, ఐసీటీ థీమాటిక్ లీడ్ ప్రవీణ్ శ్రీరామశెట్టి, వ్యూహాత్మక సమాచార విభాగం థీమాటిక్ లీడ్ టి. విశ్వేశ్వరరావు పాల్గొని మహిళలకు ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను వివరించారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పంటల సామర్థ్యాన్ని పెంచడం, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యతను తెలియజేశారు. ఇంటి ఆవరణలో న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కుటుంబ అవసరాలకు సరిపడా తాజా, పోషక విలువలున్న కూరగాయలను పండించి ఆహార భద్రతను పెంపొందించుకోవచ్చని సూచించారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతి నేలలో సూక్ష్మజీవ వ్యవస్థను, నేల నిర్మాణాన్ని మెరుగుపరుస్తుందని, తద్వారా పంటలు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకుంటాయని వివరించారు. ఏపీసీఎన్ఎఫ్ కు సంబంధించిన తొమ్మిది సార్వత్రిక సూత్రాలను పరిచయం చేస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, స్థిరమైన సాగు పద్ధతులను అనుసరించడం, బాహ్య వ్యవసాయ పెట్టుబడులపై ఆధారపడటాన్ని తగ్గించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు తమ ఇళ్లలో, గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేసే అవకాశాలపై చర్చించారు. గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలు, ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల మధ్య సమన్వయంతో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు స్థిరమైన వ్యవసాయాన్ని బలోపేతం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ మహిళలకు విజ్ఞానాన్ని అందించడం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించడం, మహిళా సాధికారతను బలోపేతం చేయడంలో నేషనల్ సరస్ మేళా కీలక వేదికగా నిలుస్తోంది.

ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ రంజీ పోరుకు రంగం సిద్ధం

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్:

మూలపాడు క్రికెట్ మైదానం వేదికగా ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య జరగనున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 26న ఉదయం 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. రెండు జట్లకు ఈ పోరు కీలకం కావడంతో ఆటగాళ్లు విజయమే లక్ష్యంగా ముమ్మరంగా సాధన చేస్తున్నారు. మ్యాచ్‌లో ఆధిపత్యం సాధించేందుకు ఇరు జట్లు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ప్రత్యర్థి జట్టు వ్యూహాలను అధిగమించి కీలక విజయాన్ని నమోదు చేయాలని పట్టుదలతో ఉన్నాయి. రంజీ ట్రోఫీలో భాగంగా జరగనున్న ఈ మ్యాచ్ ఆసక్తికరంగా సాగనుండగా, తొలి రోజు ఆట కీలకం కానుంది. టాస్‌తో పాటు బ్యాటింగ్, బౌలింగ్ వ్యూహాలు మ్యాచ్ గమనాన్ని ప్రభావితం చేసే అవకాశముంది. మూలపాడు వేదికగా జరగనున్న ఈ పోరుపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనున్న ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగే అవకాశం ఉంది.

కూటమి అభ్యర్థులకు పశ్చిమలో బ్రహ్మరథం





విజయవాడ, మహానగర్:

పశ్చిమ నియోజకవర్గంలోని 12 డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విస్తృతంగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 42, 43, 44, 45, 46, 47, 49, 50, 51, 52, 53, 54 డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొని, వారి విజయానికి సహకరించాలని ప్రజలను కోరారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులతో కలిసి పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్ సెంటర్, నెహ్రూ బొమ్మ సెంటర్, కోమల విలాస్ సెంటర్, చేపల మార్కెట్, పంజా సెంటర్, వించిపేట, నైజాం గేట్, ఎర్రకట్ట తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, కూటమి క్లీన్ స్వీప్ లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారాన్ని కేవలం ఓట్ల అభ్యర్థనకే పరిమితం చేయకుండా ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి అవసరాలను అర్థం చేసుకోవడానికి అవకాశంగా మలచుకోవాలన్నారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం మేయర్, కార్పొరేటర్లు ప్రతి డివిజన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తారని తెలిపారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. నగర అభివృద్ధిని వేగవంతం చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో ఆయా డివిజన్ల కూటమి అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూర్పులో కూటమి నేతల విస్తృత ప్రచారం

విజయవాడ, మహానగర్

తూర్పు నియోజకవర్గంలోని మాచవరం, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, గుణదల ప్రాంతాల్లో కూటమి నేతలు ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2, 4, 5, 6, 7, 8, 9వ డివిజన్ల పరిధిలో మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు నేతలకు ఘనస్వాగతం పలకగా, మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో విజయవాడలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, వరదల సమయంలో ప్రజలకు ఎదురైన ఇబ్బందులను అధిగమించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలు ఉపయోగపడ్డాయని తెలిపారు. కొండ ప్రాంత ప్రజలు గత 50 ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని, సుమారు 26,500 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని అన్నారు. విజయవాడ అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ సమన్వయంతో పనిచేసే ప్రజాప్రతినిధులు ఉండాలని పేర్కొన్నారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ



ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బీజేపీ నేతలతో కలిసి ఐక్యతతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. నగర అభివృద్ధికి ఎంపీ కేశినేని చిన్ని కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో దెబ్బతిన్న వ్యవస్థలను తిరిగి గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని, స్థానిక సంస్థల్లోనూ కూటమి ప్రజాప్రతినిధులు ఉంటే నగర అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని అన్నారు. ప్రచారంలో కూటమి నేతలు ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తుఫాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం




- ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు
- ఉద్ధృతంగా గాలులు వీచే అవకాశమున్నందున ముందు జాగ్రత్తలు
- కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ (91549 70454) ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్

ఆర్నబ్ తుఫాను ప్రభావంతో జిల్లాలో పెనుగాలులతో పాటు భారీ వర్షాల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు సహాయక, రక్షణ చర్యలను ముమ్మరం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, పౌరసరఫరాలు, వైద్య, జలవనరులు తదితర శాఖల జిల్లా అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రోడ్ల పక్కన ఉన్న భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. హోర్డింగ్‌ల ఫ్రేమ్‌లపై ఉన్న ఫ్లెక్సీలను తొలగించి ఖాళీగా ఉంచాలని, జోన్ల వారీగా తొలగింపు నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, పాత భవనాలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న వారిని ముందుగానే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన పునరావాస కేంద్రాలుగా విద్యాసంస్థల భవనాలు, ఫంక్షన్ హాళ్లను సిద్ధం చేయాలని సూచించారు. తుఫాను ప్రభావిత పరిస్థితుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అంబులెన్సులను వికేంద్రీకరించి అన్ని డివిజన్లు, మండలాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సామాగ్రిని అవసరమైన ప్రదేశాల్లో ముందుగా డంప్ చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తిరువూరు, విస్సన్నపేట, జగ్గయ్యపేట ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో రోడ్ల క్లియరెన్స్, విద్యుత్ పునరుద్ధరణ, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో అత్యవసర స్పందన బృందాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈదురుగాలుల కారణంగా చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన సందర్భాల్లో గరిష్టంగా అరగంటలో రహదారులను క్లియర్ చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని తాగునీటి ప్లాంట్ల వద్ద తగినన్ని డీజిల్ జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అవసరమైన అత్యవసర సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో తుఫాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను యాక్టివేట్ చేసినట్లు తెలిపారు. మండల స్థాయి స్పందన బృందాల వివరాలు, సహాయక నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సహాయం అవసరమైనప్పుడు స్థానిక వార్డు లేదా గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని, అలాగే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454 కు సమాచారం అందించాలని కోరారు. తుఫాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

జాల సంరక్షణే శ్రీరామ రక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేక పోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి.



ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి.ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి.. ప్రజలు భాగస్వాములు కావాలి.. జలసంరక్షణ ప్రతి ఇంటి సంకల్పంగా, ప్రతి గ్రామం లక్ష్యంగా, ప్రతి ప్రభుత్వ వ్యవస్థ కర్తవ్యంగా మారాలి. నీటిని కాపాడుకుందాం.. భవిష్యత్తును నిలబెట్టుకుందాం!

దేశాన్ని కాపాడుతున్నది యువతే!



స్టాక్ మార్కెట్‌లో రక్త కన్నీరు ఆగడం లేదు. లక్షల కోట్ల సంపద ఆవిరి అవుతున్నది. గడిచిన రెండున్నరేండ్ల నుంచి మార్కెట్ తిరోగమన దిశలో పయనిస్తున్నది. దేశంలో అప్రజాస్వామిక విధానాల పట్ల జెన్-జీ యువత ఉద్యమిస్తున్నది. నియంతృత్వం మీద పోరాటం చేసే శక్తులు ఇంకా ఉన్నాయని నిరూపించింది. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాదు చివరకు మన ఆర్థిక వ్యవస్థను బతికిస్తున్నది కూడా యువతనే. 'విదేశాల్లో అంట్లు తోమి బతుకుతున్నారు' అని యువతను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చులకన చేసి మాట్లాడినా, ప్రశ్నిస్తున్న యువతను 'దిమాగీ నక్సల్స్' అని ప్రధాని నరేంద్ర మోదీ చిన్నచూపు చూస్తున్నా దేశాన్ని ఆర్థికంగా కుంగిపోకుండా నిలబెడుతున్నది యువతనే. ప్రపంచంలో ముడి చమురు ధర 114.22 డాలర్లకు, డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.94.93 చేరుకున్నది. పులి మీద పుట్రలా ఈ రెండు దెబ్బలు సరిపోవు అని విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రెండేండ్లలోనే రూ.5.5 లక్షల కోట్ల నిధులు మన మార్కెట్ నుంచి తరలించుకు వెళ్లారు. ఈ మూడు దెబ్బలతో మన స్టాక్ మార్కెట్ మాత్రమే కాదు, మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి నెలకొన్నది. ఈ స్థితి నుంచి దేశాన్ని ఆర్థికంగా రక్షిస్తున్నది యువతనే.

ప్రపంచంలో అనేక దేశాల్లో ఉద్యోగాలు చేస్తూ తమ సంపాదనను ఇండియాకు పంపిస్తున్న యువత వల్ల విదేశీ మారకద్రవ్యం నిలువలు అడుగంటకుండా గౌరవ ప్రదంగా నిలిచాయి. కరోనా తర్వాత మన దేశంలోని యువత ఉద్యోగ భద్రత లేకపోవడం, భవిష్యత్తు కోసం పొదుపు అనే ఆలోచన చేయడం మొదలు పెట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) ద్వారా నెలనెలా పెద్ద మొత్తంలో యువత ఇన్వెస్ట్ చేస్తున్నారు.

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్‌లు ఎంత వేగంగా నిధులు తీసుకువెళ్తున్నారో అంతే వేగంగా యువత సిప్ ద్వారా ఆ లోటును భర్తీ చేస్తున్నది. దేశవిదేశాల్లోని యువత ఇప్పుడు ఆదుకోకపోయి ఉంటే దేశం మరింతగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉండేది. ఇలాంటి యువతకు పాలకులు 'దిమాగీ నక్సల్స్' అని పేరు పెట్టినా, అంట్లు తోమడానికి విదేశాలకు వెళ్తారు అని తిట్టినా దేశాన్ని ఇప్పుడు ఆర్థికంగా ఆదుకుంటున్నది వాళ్లే. క్రూడ్ ఆయిల్ దిగుమతి బిల్లు ఏటా 137 బిలియన్ డాలర్లు, అంటే మన రూపాయల్లో రూ.11.5 లక్షల కోట్లు.

విదేశాల్లో పని చేసే భారతీయులు ఏటా పంపే నిధులు 135.46 బిలియన్ డాలర్లు అంటే రూ.11.4 లక్షల కోట్లు. క్రూడ్ ఆయిల్ బిల్లుకు మనం చెల్లించే నిధులు, విదేశాల నుంచి మన మనవాళ్లు పంపే నిధులు దాదాపు సమానంగా ఉన్నాయి. విదేశీ మారకద్రవ్యం విషయంలో విదేశాల్లో పని చేసే మన వాళ్లు దేశానికి ఈ విధంగా అండగా నిలిచారు.

ఇక సిప్‌ల ద్వారా మన యువత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3.5 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అదే సమయంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్‌లు రూ.1.81 లక్షల కోట్లు దేశం నుంచి తరలించుకుపోయారు. నిరుడు విదేశీ పెట్టుబడిదారులు తరలించిన దాని కన్నా మన వాళ్లు సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసింది దాదాపు రెట్టింపు. అయితే ఇది ఇప్పుడు చాలా వేగంగా రివర్స్ అవుతున్నది. ఈ సెప్టెంబర్‌లో సిప్‌ల ద్వారా రూ.32,490 కోట్ల పెట్టుబడులు వస్తే అదే నెలలో విదేశీ పెట్టుబడి దారులు రూ.44,013 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఈ అంతరం చాలా వేగంగా పెరిగే అవకాశం ఉన్నది. సిప్‌ల ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నది ఎక్కువగా యువతనే. సిప్‌లపై రెండున్నరేండ్ల నుంచి ఎలాంటి లాభం లేదు. పైగా దాదాపు 25 శాతం వరకు నష్టం వచ్చింది. మార్కెట్లో పరిస్థితి ఇలానే ఉంటే క్రమంగా సిప్‌ల మీద ఆసక్తి తగ్గుతుంది.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గత తొమ్మిదేండ్లలో మన దేశంలో ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేశారో, కేవలం రెండేండ్లలో అంత మొత్తం వెనక్కి తీసుకున్నారు. 2015 అక్టోబర్ నుంచి 2024 అక్టోబర్ నాటికి మన మార్కెట్‌లో 63.5 బిలియన్ డాలర్‌ల పెట్టుబడులు వచ్చాయి. 2024 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ నాటికి 63.6 బిలియన్ డాలర్‌ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈ నెల ముగింపునకు ఇంకా వారం రోజుల గడువు ఉన్నది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల తరలింపు ఆగడం లేదు. ఇక్కడ కాకపోతే ఇంకెక్కడ పెట్టుబడి పెడతారు అని స్టాక్ మార్కెట్ నిపుణులు ఏడాది క్రితం ఆత్మవిశ్వాసంతో ప్రకటించేవారు. నిధుల తరలింపు ప్రవాహం ఆగకపోవడంతో ఇక్కడ కాక పోతే ఇంకెక్కడ ఇన్వెస్ట్ చేస్తారు అనేవారి మాటల్లో ఇప్పుడు ఆ ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. మన రూపాయల్లో అంటే 2026 అక్టోబర్ నాటికి రూ.5.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఏఐ సెమీ కండక్టర్ రంగాల్లోకి నిధులు తరలి వెళ్తున్నాయని మొదట నిపుణులు అంచనా వేశారు. ఆ దేశాల్లో ఏఐ బుడగ పేలిపోయినప్పటికీ మన దేశం నుంచి నిధుల ప్రవాహం తరలివెళ్లడం ఆగలేదు. అక్కడ ఏఐ ప్రతికూల పరిస్థితుల్లో మన దేశానికి పెట్టుబడులు తరలి రావాలి. కానీ రావడం కాదు. కనీసం మన దేశం నుంచి నిధులు తరలివెళ్లడం కూడా ఆగలేదు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మన దేశం నుంచి నిధులు తరలించుకువెళ్లడం గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విచిత్రమైన వాదన చేశారు. మన దేశ మార్కెట్ నుంచి సులభంగా నిధులు తరలించుకు వెళ్లే అవకాశం ఉన్నది కాబట్టి విదేశీ సంస్థాగత పెట్టుబడి దారులు నిధులు తలరిస్తున్నారట. దొంగతనాలు ఎందుకు జరుగుతున్నాయి అంటే 'సంపద ఉన్నది కాబట్టి దొంగతనాలు జరుగుతున్నాయి' అని సమర్థించుకున్నట్టుగా ఉన్నది. దేశంలోకి విదేశీ నిధులు రావడం అంటే దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగడం. నిధులు తరలివెళ్తున్నాయి అంటే ఉపాధి అవకాశాలకు గండి పడుతున్నదని అనే అర్థం. ఈ విషయం పాలకులు గ్రహించాలి. స్టాక్ మార్కెట్‌లో రక్తపాతాన్ని అడ్డుకోవడానికి, నిధుల తరలింపునకు సరైన కారణాలను కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోకపోతే, సమస్య పరిష్కారానికి పూనుకోక పోతే, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో పడుతుంది.


మిషనరీల దృష్టి దోషం అందరికీ సోకింది!

'హిందూత్వ', 'బ్రాహ్మణిజం', 'సంస్కృత సంప్రదాయం' అనే అంశాలు నేటి చర్చల్లో, వాదనల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. హిందూత్వవాదులతో పాటు వారిని వ్యతిరేకించే సెక్యులరిస్టులు, దళితవాదులు, కమ్యూనిస్టులు అందరూ ఒకే రకమైన ఏకశిలా సదృశ సంస్కృతిని ఊహిస్తూ మాట్లాడటం విశేషం. 'బ్రాహ్మణిజమే హిందూయిజం, హిందూయిజమే బ్రాహ్మణిజం' అని బ్రిటిష్ ప్రొటెస్టెంట్ క్రైస్తవ మిషనరీలు నిర్వచించాయి. 'సంస్కృతం అన్ని భారతీయ భాషలకూ తల్లి' అన్నారు. సంస్కృతాన్ని, బ్రాహ్మణులను ప్రభావశీలురుగా చిత్రిస్తూ, ఇతరులను నిష్క్రియాత్మక స్వభావం కలవారిగా చూడటం ఈ క్రైస్తవ దృష్టిలోని లోపం. ఇది భారతీయులను కూడా ఆవహించింది. ఆగ్నేయాసియా అంతటా బ్రాహ్మణులు, కర్మకాండలు, సంస్కృత భాష వర్ధిల్లాయి. అయితే అక్కడి బ్రాహ్మణులు కులాంతర వివాహాలు కూడా చేసుకునేవారు. దేశ కాల పరిస్థితులను బట్టి బ్రాహ్మణ వ్యవస్థ, సంస్కృత సంప్రదాయాలు సౌలభ్యాన్ని, సర్దుబాటు తత్వాన్ని ప్రదర్శించాయి. ప్రాంతీయ భాషల వికాసం తర్వాత సంస్కృత ప్రాధాన్యం పరోక్షంగా మారిందే తప్ప నశించలేదు. స్థానిక భాషలను సంస్కృతం, సంస్కృతాన్ని స్థానిక భాషలు పరస్పరం ప్రభావితం చేసుకున్నాయి. అందుకే, మీమాంస భాష్యకారుడు శబరుడు 'వేదాన్ని అధ్యయనం చేయడానికి మ్లేచ్ఛ భాషల పరిజ్ఞానం కూడా పనికొస్తుంది' అన్నాడు. అలంకార శాస్త్రవేత్త రాజశేఖరుడు సంస్కృతంపై ప్రాకృత భాషల ప్రభావాన్ని ఏనాడో చెప్పాడు. అలాగే సంస్కృతం స్థానిక భాషల్లోకి ఇంకిపోయి వాటిని సంపన్నం చేసింది. కాబట్టి, మాతృభాషల వికాసాన్ని 'సంస్కృత వ్యతిరేకత'గా భావించలేం. ప్రతిదాన్నీ దీఅఱుతీఎ ూజూజూశీంట్అశీఅంగా చూసే ఆధునిక దృక్పథం నుంచి బయటపడాలి. బ్రాహ్మణులు మాత్రమే ఆధ్యాత్మికతకు, సంస్కృతికి, జ్ఞానానికి, చదువుకు మారుపేరని... శూద్రులు, బ్రాహ్మణేతరులు భౌతిక శ్రమకు మాత్రమే వారసులని భావించడం పొరపాటు. సంస్కృతం కేవలం పురోహిత ఆధ్యాత్మిక భాష అని, మాతృభాషలు లౌకిక వ్యవహారాలకే పరిమితమైన భాషలని అనుకోవడం కూడా తప్పు. ఇటువంటి అభిప్రాయాలు ఏర్పడటానికి ప్రొటెస్టెంట్ క్రైస్తవ మిషనరీల ధోరణి కారణం. బిషప్ హెన్రీ వైట్ హెడ్ వంటి క్రైస్తవ మిషనరీలు బ్రాహ్మణులను వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలను మాత్రమే చూస్తూ, శూద్రుల ఆచారాలను, సంస్కృతిని తక్కువ స్థాయివిగా నిలిపారు. ఈ క్రమంలోనే 'హిందూయిజం' అనే కృత్రిమ సిద్ధాంతాన్ని సృష్టించారు. చైనాలోని కన్ఫ్యూషియస్ సిద్ధాంతం, ఒకే భాష, ఒకే హాన్ జాతి ఆధిపత్యం కేంద్రీకృత రాజ్యానికి పునాదిగా నిలిస్తే, భారతదేశంలో అటువంటి ఏకీకృత జాతీయత లేకపోవడం హిందూత్వవాదులను ఆందోళనకు గురిచేస్తుంటుంది. బ్రాహ్మణుడు, సంస్కృతం హిందూయిజానికి కేంద్రం అని విలియం కేరీ వంటి మిషనరీలు క్రైస్తవ దృక్పథంతో ప్రచారం చేశాయి. బ్రిటిష్ పాలనా సౌలభ్యం కోసం ఐరోపాలోని 'కోడ్ ఆఫ్ లా' తరహాలో విలియం జోన్స్ వంటి వలస అనువాదకులు 'మనుస్మృతి ఆధారిత సంస్కృత సంప్రదాయమే ప్రధాన హిందూమతం' అనే మూస చట్రాన్ని తయారు చేశారు. తమిళనాడులో పనిచేసిన ఫ్రాన్సిస్ జేవియర్, బార్తలోమాయస్ జీగెన్‌బాల్గ్ (17--18 శతాబ్దం) వంటి మిషనరీల లేఖలు... స్థానిక ఆచారాలు ధర్మశాస్త్రాన్ని అనుసరించవని నిరూపిస్తున్నాయి. గ్రామ పంచాయతీల ద్వారానే న్యాయం జరిగేది. కొన్ని కులాల్లో మాతృస్వామ్యం ఆధారంగా ఆస్తి వారసత్వం ఉండేది. క్రైస్తవ మిషనరీలు తమ ఐరోపా నియో--ప్లాటోనిక్ చట్రంలో అద్వైతాన్ని ఒక రకమైన 'సర్వేశ్వరవాదం'గా అర్థం చేసుకున్నాయి. క్రైస్తవ ప్యూరిటానిజం ప్రభావంతో భాగవత లీలల కృష్ణుడి స్థానంలో, మహాభారతంలోని ధీరోదాత్తుడైన, పౌరుషం కలిగిన కృష్ణుడిని సంస్కర్తగా, చరిత్ర పురుషుడిగా బంకించంద్ర చటర్జీ వంటివారు ముందుకు తెచ్చారు. అద్వైతాన్ని పాంథీయిజంగా, వైష్ణవాన్ని 'మ్యాన్లీ గాడ్' భావనగా మార్చి, క్రైస్తవ ప్యూరిటానిజం ప్రభావంతో నిర్మించినదే-- నేటి హిందుత్వ క్రైస్తవ వలసవాదులు వర్తమానంతో సంబంధంలేని-- సుదూర గతానికి సంబంధించిన--ఒక బ్రాహ్మణిజాన్ని హిందూయిజంగా నిర్వచించారు. ముఖ్యంగా దక్షిణాదిన ఎప్పుడూ ఏకశిలా సంస్కృతి లేదు. సంస్కృత--వైదిక వ్యవస్థలపై, ఆచారాలపై విమర్శలు వ్యక్తమవుతూ వచ్చాయి. పల్లవ రాజు మహేంద్రవర్మ (7 శ.) 'మత్తవిలాస ప్రహసనం' సంస్కృత నాటకంలోనే బ్రాహ్మణ వైదిక ఆచారాలను, కాపాలిక, బౌద్ధ సన్యాసుల వేషధారణలను, ఆడంబరాలను, నైతిక పతనాన్ని హాస్యాస్పోరకంగా విమర్శించాడు. తమిళ ప్రాచ్య పండితుడు నీలకంఠ దీక్షిత (17 శ.) 'కలివిడంబనమ్' అనే సంస్కృత గ్రంథంలో ఆధ్యాత్మిక విశ్వాసాలు, పూజాది క్రమాలు, వైదిక కర్మకాండలు వ్యాపారాత్మకంగా ఎలా దిగజారిపోయాయో ఎండగట్టాడు. జగన్నాథ పండితరాయలు (17 శ.) సంస్కృతంలో 'అసఫ్ విలాసము', అలాగే ప్రేమ కవిత్వం రాయడం సంస్కృతంలోని లౌకిక, శృంగార స్వభావాన్ని నిరూపిస్తాయి. అదే కాలంలో, తెలుగులో భక్త రామదాసు, మరాఠీలో తుకారాం, సమర్థ రామదాసు వంటి భక్తకవులు ఆధ్యాత్మిక భావాలను వెల్లివిరియజేశారు. తిరుప్పావైని వేదంగా ఆరాధించేలా చేశారు. దీనిద్వారా సంస్కృతం కేవలం ఆధ్యాత్మిక భాష కాదని, అలాగే ప్రాంతీయ భాషలు కేవలం లౌకికమైనవి కాక, ఆధ్యాత్మిక రచనలకు నిలయాలని స్పష్టమవుతోంది.

దక్షిణాదిన లేదా భారత ఉపఖండంలో 'ఆర్యావర్త సంస్కృతి' ఏకపక్షంగా విస్తరించలేదు. అలాగే ఆర్యావర్తం, ఉత్తరాది అంటే-- సంస్కృతం, బ్రాహ్మణులు మాత్రమే కాదు. బ్రాహ్మణేతర సంస్కృతులు, సంస్కృతేతర భాషలు భారత ఖండ సంస్కృతిని మొత్తంగా ప్రభావితం చేశాయి. దక్షిణాదిలోకి ఉత్తరాది సంస్కృతి మాత్రమే కాదు, ఉత్తరాదిలోకి దక్షిణాది సంస్కృతి కూడా విస్తరించింది (శంకర, రామానుజ, మధ్వ మొదలైన సిద్ధాంతకర్తలు). కాలక్రమేణా భారతదేశాన్ని ఒకే చట్రంలోకి నెట్టడం సాధ్యం కాదని గ్రహించిన అనంతర మిషనరీలు 'తమిళ శైవం' వంటి ద్రవిడ సంప్రదాయాలను కూడా అధ్యయనం చేశాయి. భారతదేశంలో గుప్తులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, పల్లవులు, చోళులు, రాజపుత్రుల పాలనలో సుమారు 900 ఏళ్లు సంస్కృతం ప్రధాన రాజభాషగా వెలిగింది. ఆ తర్వాత వెయ్యి సంవత్సరాలుగా ప్రాంతీయ భాషలే (తెలుగు, తమిళం, కన్నడ, మరాఠీ మొదలైనవి) రాజ్యం చేశాయి. తుకారాం, పోతన, జ్ఞానేశ్వరుడు, కబీర్ వంటి భక్తకవుల వల్ల ఆధ్యాత్మికత కూడా ప్రాంతీయ భాషల ద్వారానే వ్యాపించింది. "భారతదేశంలో ముస్లింల దండయాత్రల వల్లే సంస్కృత భాష, సంస్కృతి క్షీణించాయి" అన్న హిందూత్వవాదుల వాదన తప్పు. ఆగ్నేయాసియా దేశాలలో ముస్లిం దండయాత్రల తాకిడి తక్కువ. సా.శ.200 నుంచి 1350 వరకు సంస్కృతం రాజభాషగా వెలిగినా, 14వ శతాబ్దం నాటికి దాని ఆధిపత్యం తగ్గింది. థేరవాద బౌద్ధమతం ప్రజాదరణ పొందడంతో పాళీ భాష, స్థానిక మాతృభాషలు రాజభాషలుగా మారాయి. సంస్కృతం స్థానంలో స్థానిక భాషలు ఆధిపత్యంలోకి రావడం.. దండయాత్రల వల్ల జరిగింది కాదు. అది కాలక్రమేణా సంస్కృత క్లిష్టతను దాటి, ప్రజల భాషలు బలపడే సహజ సాంస్కృతిక--భాషా పరిణామం. సంస్కృత ఆధిపత్యాన్ని సనాతన సంస్కృత పండితుడు, హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసు వ్యతిరేకిస్తూ, అచ్చ తెలుగులో కావ్యం రాయడం విశేషం. ఆధునిక అర్థంలో నిశ్చితమైన సరిహద్దులు కలిగిన 'నేషన్--స్టేట్' లేదా 'దేశం' అనే భావన ప్రాచీన కాలంలో మనకు లేదు. విశాలమైన సాంస్కృతిక క్షేత్రంగా మాత్రమే ఉనికిలో ఉండేది. విభిన్న భాషలు, సంస్కృతులు, తెగలు సమ్మిళితమవడానికి ఈ పరిస్థితి దారితీసింది.

ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

ఆధునిక కాలంలో యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు. 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో, మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యం. నేడు, సైబర్ ముప్పుల రూపురేఖలు నిరంతరం మారుతున్నాయి. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేం. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుంది' అని ప్రధాని మోదీ అన్నారు.



సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు

దేశ బ్యాంకింగ్ రంగం ప్రస్తుతం ప్రపంచంలోనే సమర్థంగా పనిచేస్తున్న వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని ప్రధాని పేర్కొన్నారు. ప్రజలకు రోజులో 24 గంటలూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చిన్న వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు, వీధి వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులకు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. గతంలో బ్యాంకింగ్ సేవలు కొద్దిమంది సంపన్నులు, పలుకుబడి ఉన్నవారికే ఎక్కువగా పరిమితమయ్యాయని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ధనికులకు రుణాలు సులభంగా లభించేవని, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలకు తగిన అవకాశాలు దక్కలేదని ఆరోపించారు. 2014 తర్వాత సమతుల్య విధానాన్ని అనుసరించడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. గతంలో డెబిట్, క్రెడిట్ కార్డులు సామాన్యులకు అందని విలాస వస్తువులుగా ఉండేవని, ప్రస్తుతం అవి విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

రానున్న దశాబ్దంలో మరింత సమర్థమైన సేవలు

గత పదేళ్లలో బ్యాంకింగ్ సేవలు అందని వర్గాలకు వాటిని చేరువ చేయడంపై దృష్టి సారించామని మోదీ చెప్పారు. ఇక రానున్న దశాబ్దంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సమర్థంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండటమే కాకుండా, వాటిని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా చూడాలని అభిప్రాయపడ్డారు. డిజిటల్ లావాదేవీల భద్రత, వేగవంతమైన సేవలు, ఆర్థిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం భవిష్యత్తులో కీలకమని ఆయన వ్యాఖ్యల

రూ.169 కోట్లతో కీలక సదుపాయాలు

భువనేశ్వర్‌లో ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రధాని ప్రారంభించారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవల భద్రతను బలోపేతం చేయడం, సైబర్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరమని మోదీ అన్నారు. కొత్త సదుపాయాలు ఈ దిశగా ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ఒడిశా అభివృద్ధిపై కూడా ప్రధాని మాట్లాడారు. గనుల రంగం నుంచి మైక్రోచిప్‌ల తయారీ వరకు పలు రంగాల్లో రాష్ట్రం భవిష్యత్తును నిర్మించుకోగలదని అన్నారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించే అనేక మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్య రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బిహార్ రాజధాని పట్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీయగా బీజేపీ మండిపడింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్ అధ్యక్షుడిపై విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బిహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన వారందరినీ కాంగ్రెస్ పార్టీ జైలుకు పంపిస్తుందని ఖర్గే అన్నారు. ఇక్కడ ఖర్గే ప్రసంగిస్తున్న సమయంలోనే సంతోష్ కుమార్ అనే ఓ వ్యక్తి 'తిరుగుబాటు జరిగేంతవరకు మోదీ ఎక్కడికీ వెళ్లరు' అని అరిచారు. దీంతో స్పందించిన ఖర్గే ఆగ్రహంతో 'మోదీ కా బాప్ భీ జాయేగా, బాప్ భీ జాయేగా (మోదీనే కాదు, మోదీ తండ్రి కూడా వెళ్లాల్సిందే)' అని అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సభలో అలజడి రేగగా, నినాదాలు చేసిన ఆ వ్యక్తిని సభ నుంచి బయటికి పంపించారు. తన వ్యాఖ్యలపై ఖర్గే సమర్థించుకుంటూ, ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాల్ని ఉల్లంఘిస్తోందని, సర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల్ని ప్రభావితం చేస్తోందని అన్నారు. ఇక ఖర్గే వ్యాఖ్యలను ఎన్డీఏ నేతలు తీవ్రంగా ఖండించారు.



అమిత్ షా తీవ్ర విమర్శలు

ఖర్గే వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్స్‌లో స్పందించారు. పట్నాలో మోదీ తండ్రిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా ఖర్గే అన్ని హద్దులను దాటారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గతంలోనూ మోదీని, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని షా విమర్శించారు. వరుస ఓటములతో కాంగ్రెస్ తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిందని, చేసేదేం లేక వ్యక్తిగత దూషణలకు దిగుతోందని ఆరోపించారు.

'కాంగ్రెస్ అధ్యక్షుడి నోటి వెంట వచ్చిన మాటలు రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. ప్రధాని మోదీ, ఆయన కుటుంబంపై కాంగ్రెస్ నేతలు అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ఇదేం మొదటిసారి కాదు. గతంలో ఆయన తల్లిని అవమానించారు. ఆయనను మర్చంట్ ఆఫ్ డెత్ అన్నారు. ఆయన పేదరికాన్ని ఎగతాళి చేస్తూ ఛాయ్‌వాలా అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ రోజురోజుకూ హద్దుల్ని దాటుతోంది. సంయమనం కోల్పోతుంది' అని అమిత్ షా పేర్కొన్నారు.

నిబిన్ నబిన్ ఫైర్

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. రాజకీయ ప్రత్యర్థుల్ని విమర్శించేటప్పుడు కూడా గౌరవం, మర్యాదలు పాటించాలని పేర్కొన్నారు. మరణించిన కుటుంబ సభ్యులను రాజకీయ ప్రసంగాల్లోకి తీసుకురావడం తగదని అన్నారు. దేశాభివృద్ధి, ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలపై మాట్లాడేదేం లేకనే ప్రతిపక్షాలు ఇలా వ్యక్తిగత దాడులకు దిగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇంకా ఖర్గే వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ కూడా ఎక్స్‌లో తీవ్ర విమర్శలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రౌడీలు, గూండాలు వాడే భాషను ఉపయోగిస్తున్నారని పేర్కొంది. ఇది రాజకీయం కాదు, అచ్చం మాఫియా గ్యాంగ్ ప్రవర్తనలా ఉందని విమర్శించింది. ఇతర కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, గిరిరాజ్ సింగ్, పీయూష్ గోయల్ సహా మాజీ మంత్రులు, ఎంపీలు ధర్మేంద్ర ప్రదాన్, రవిశంకర్ ప్రసాద్, బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర, బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ కూడా ఖర్గే వ్యాఖ్యల్ని ఖండిస్తూ, తక్షణమే మోదీకి, దేశప్రజలకు ఖర్గే, రాహుల్, సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఖర్గేపై పోలీసులకు ఫిర్యాదు

కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలపై బిహార్ బీజేపీ పోలీసుల్ని ఆశ్రయించింది. పట్నాలోని పోలీస్ స్టేషన్‌లో మల్లికార్జున్ ఖర్గేపై ఫిర్యాదు నమోదు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, ఆయన తండ్రిని ఉద్దేశించి ఖర్గే అవమానకరమైన భాష ఉపయోగించారని ఆరోపించిన అక్కడి నాయకులు, ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఐఆర్, బ్లాక్‌మనీని ప్రస్తావిస్తూ ఖర్గే విమర్శలు

వివాదానికి ముందు ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సర్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. భవిష్యత్తులో ఎన్నికల్ని బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించాలని, గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తొలి 100 రోజుల్లో నల్లధనాన్ని తిరిగి తీసుకొస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, ఆ డబ్బు ఏమైందని ఖర్గే ప్రశ్నించారు. ఇంకా బిహార్ మాజీ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఎన్డీయే కూటమితో కలవడాన్ని కూడా ఖర్గే విమర్శించారు. అయితే దీనిపై స్పందించిన జేడీయూ ఖర్గే ఆరోపణల్ని తోసిపుచ్చింది. ఎన్నికలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరిగాయని పేర్కొంది.

ఓటును, దేశాన్ని కాపాడుకుందాం

నవంబర్ 1న భారీ ర్యాలీకి రాహుల్ గాంధీ పిలుపు

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, ఓట్ల చోరీ ఆరోపణలపై నిరసనగా నవంబర్ 1న దిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. 'సేవ్ ది ఓట్ సేవ్ ది కంట్రీ' పేరుతో జన మార్చ్, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు సహా ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగిస్తున్నారు. నిబంధనలను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తిన వారిపై లాఠీలతో దాడులు చేశారు. దీనిని ఏ పరిస్థితుల్లోనూ ప్రజలు మౌనంగా సహించరు. నవంబర్ 1న దిల్లీకి పదండి. ఓటును, దేశాన్ని కాపాడుకుందాం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు పౌరులు ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ఓటు మీది. పోరాటమూ మీదే' అంటూ రాంలీలా మైదాన్?, దిల్లీ అని పోస్ట్?లో రాసుకొచ్చారు. అలాగే గమనిక అని తమ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు వ్యంగ్యంగా కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీకి ముందు మరో ఏడు రోజులపాటు ఇదే ఉత్సాహంతో ప్రచారం కొనసాగించాలని వ్యాఖ్యానించారు.



మూడు రోజులపాటు దిల్లీలోనే ఎంపీలు

ఇదిలా ఉండగా, ర్యాలీ నేపథ్యంలో పార్టీ ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక సూచనలు చేశారు. అక్టోబర్ 30,31, నవంబర్ 1 తేదీల్లో ఎంపీలంతా దిల్లీలో అందుబాటులో ఉండాలని కోరారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఎంపీలు పాల్గొనేలా కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల అక్రమాలు, ఓట్ల తొలగింపును నిరసిస్తూ అక్టోబర్ 30న దిల్లీలోని అశోక్ హోటల్ వేదికగా విపక్షాలు మాక్ పార్లమెంట్ నిర్వహించనున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న జజుజ తీరును ఎండగడుతూ ప్రతీకాత్మకంగా ఆయనపై ఈ వేదికగా ప్రజా అభిశంసన చేపట్టనున్నారు. ఇండియా కూటమికి చెందిన ఎంపీలు, అగ్రనేతలంతా హాజరయ్యే ఈ సమావేశంలో జజుజకి వ్యతిరేకంగా ఒక బహిరంగ ప్రజా తీర్పును కూడా వెల్లడించనున్నారు. ఈ మాక్ పార్లమెంట్ ముగిసిన అనంతరం నవంబర్ 1న ఓట్ చోరీకి వ్యతిరేకంగా పదిలక్షల మందితో రాంలీలా మైదానానికి దిల్లీ చలో మార్చ్ నిర్వహించాలని కాంగ్రెస్ తలపెట్టింది.

రామమందిర విరాళాలపై జైరాం రమేశ్ ప్రశ్నలు

ఇదిలా ఉండగా, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల వ్యవహారాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మరోసారి ప్రస్తావించారు. ప్రధాని మోదీ ఉత్తరప్రదేశ్ పర్యటన నేపథ్యంలో ఈ అంశంపై ఆయన స్పందించారు. ఆలయానికి వచ్చిన విరాళాలు, కానుకల లెక్కలపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆలయ ట్రస్టీల నియామకంపైనా ప్రశ్నలు లేవనెత్తారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలున్న వ్యక్తులను ట్రస్టీలుగా నియమించారని ఆరోపించారు. విరాళాల వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో నిధి సమర్పణ కార్యక్రమం, కార్పస్ విరాళాల ద్వారా మొత్తం రూ.3,264 కోట్లు సేకరించినట్లు ఆర్ఎస్ఎస్, ఆలయ ట్రస్టు వెల్లడించిన గణాంకాలను జైరాం రమేశ్ ప్రస్తావించారు. 2024లో తొమ్మిది నెలల్లో 13.55 కోట్ల మంది భక్తులు అయోధ్యకు వచ్చారని, 2025 మహాకుంభమేళా సమయంలో మరో పది కోట్ల మంది వరకు సందర్శించారని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు సుమారు 16 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు చెబుతున్నప్పటికీ, హుండీలు, కౌంటర్ల ద్వారా రూ.82.78 కోట్ల కానుకలు మాత్రమే వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని ఆయన అన్నారు. ఈ గణాంకాల మధ్య ఉన్న వ్యత్యాసంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

దిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్



కొన్నేళ్లుగా శీతాకాలం వస్తోందంటే చాలు దిల్లీ ప్రజలను చలితో పాటు కాలుష్య భయమూ వెంటాడుతోంది. పొగమంచు, పడిపోతున్న గాలి నాణ్యత ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలాంటి శ్వాసకోశ సమస్యలు లేనివారిని సైతం ఈ విషగాలి వదలడం లేదు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ కాలుష్యానికి అత్యంత సులువుగా బలవుతున్నారు. ఆస్తమా, జ్యూణ వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి వాయు కాలుష్యం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కేవలం ఊపిరితిత్తులకే కాకుండా, ఇది హృద్రోగాలకూ దారితీసి, గుండెపోటు ముప్పును గణనీయంగా పెంచుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "కాలుష్యం పెరిగితే సమస్యలు తీవ్రమవుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆస్తమా, సీఓపీడి, ఊపిరితిత్తుల్లో ఫైబ్రోసిస్ లాంటి ముందస్తు సమస్యలు ఉన్నవారికి ఈ కాలుష్యం శాపంగా మారుతుంది. ఇక గర్భిణీలు కూడా దీనివల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది"

దేశ రాజధానిలో కాలుష్య కోరల నుంచి రక్షించుకోవడానికి ప్రజలు తక్షణ స్వీయజాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ స్థాయిలను బట్టి బయటకు వెళ్లాలో, వద్దో తమపై తామే ఆంక్షలు విధించుకోవాలని స్పష్టం చేస్తున్నారు. "ఈ సీజన్‌లో గాలి నాణ్యత దెబ్బతింటుంది. ఏక్యూఐ300 దాటితే శ్వాసకోశ, గుండె జబ్బులు ఉన్నవారు బయట తిరగడం తగ్గించాలి. అదే 400 దాటితే అసలు బయటకు రాకూడదు. ఇక ఏక్యూఐ 200 నుంచి 300 మధ్య ఉంటే మాత్రం బహిరంగ ప్రదేశాల్లో వ్యాయామాలు పూర్తిగా మానుకోవాలి" అని ఊపిరితిత్తుల నిపుణుడు డా.వివేక్ నాంగియా తెలిపారు.

అనవసరంగా బయట తిరగకపోవడమే!

కాలుష్య ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఇళ్లలోని గాలి నాణ్యతను మెరుగుపరుచుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని జనరల్ ఫిజీషియన్లు సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు... తగిన జాగ్రత్తలు తీసుకుంటూ..అనవసరంగా బయట తిరగకపోవడమే ఉత్తమమని చెబుతున్నారు.

"కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించడం మంచి రక్షణ కవచంగా ఉంటుంది. అలాగే ఇళ్లలో, ఇండోర్‌లో గాలి నాణ్యతను మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు.. ఈ నిబంధనలను తప్పక పాటించాలి"

దిల్లీలో చలికాలం అంటే కేవలం ఉష్ణోగ్రతలు పడిపోవడం మాత్రమే కాదు. ఊపిరి సలపని గాలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కొన్నేళ్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థ కాలుష్య నివారణకు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పులు రావడంలేదు.

ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు



ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా వాడుకోవడాన్ని అంగీకరించబోమని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. కొన్ని దేశాలు ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే ఈ ముప్పు ఇంకా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత అనుభవాలు ఎన్నో గుణపాఠాలు నేర్పుతున్నా, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని పాకిస్థాన్‌ను పరోక్షంగా విమర్శించారు. దిల్లీలో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఎక్కడో ఒక చోట జరిగే యుద్ధం, ప్రపంచమంతటా ఉన్న శాంతికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించారు. "ఉగ్రవాదం శాంతికి మరో ప్రాణాంతక ముప్పు. దానిని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. దానిని ఎన్నటికీ సమర్థించలేం. ఎన్నడూ హేతుబద్ధం చేయలేం. అయినప్పటికీ, అన్ని దేశాలు ఏమాత్రం సహనాన్ని ప్రదర్శించకపోవడం వల్ల ఇది కొనసాగుతూనే ఉంది. చరిత్ర ఎన్నో పాఠాలు నేర్పినప్పటికీ, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ లెక్కలకే ప్రాధాన్యతనిస్తున్నాయి."

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణలను ప్రస్తావించిన జైశంకర్ దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంక్షోభాల సమయంలో ఐక్యరాజ్యసమితి కేవలం ప్రేక్షకపాత్ర వహించకూడదని, నాయకత్వం వహించి పరిష్కార మార్గాలకు బాటలు వేయలాని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం లోపభూయిష్టమైన ప్రపంచంలో జీవిస్తున్నామని, అయితే దాన్ని మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం ఆ ప్రాంతానికే పరిమితం కాదని జైశంకర్ స్పష్టం చేశారు. ఒక చోట జరిగే సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా శాంతికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని దేశాలు శాంతిని కాపాడేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదం, యుద్ధాలు ప్రపంచ దేశాల భద్రతతో పాటు అభివృద్ధిపైనా ప్రభావం చూపుతాయని ఆయన వ్యాఖ్యానించారు. చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను కొన్ని దేశాలు విస్మరిస్తున్నాయని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదం విషయంలో రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, అన్ని దేశాలు ఒకే విధమైన కఠిన వైఖరిని అవలంబించాలని సూచించారు.

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ, సమస్యలను పరిష్కరించుకోవడానికి దౌత్యం, చర్చలే మార్గమని జైశంకర్ అన్నారు. యుద్ధాల వల్ల ఏర్పడే సంక్షోభాలను మరింత తీవ్రతరం చేయకుండా, చర్చల ద్వారా పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. భారత్ మొదటి నుంచి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. చర్చలు, దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనే భారత వైఖరి ప్రపంచ దేశాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని అన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అనేక సమస్యలు ఉన్నప్పటికీ, పరిస్థితులను మెరుగుపరిచేందుకు దేశాలు నిరంతరం కృషి చేయాలని జైశంకర్ అభిప్రాయపడ్డారు. యుద్ధాలు, హింసకు బదులుగా శాంతి, సహకారం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచ దేశాల మధ్య పరస్పర అవగాహన పెరిగినప్పుడే సంక్షోభాలకు పరిష్కారాలు కనుగొనడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

శ్రేయస్సు, అభివృద్ధి అందరికీ అందాలి

ప్రపంచంలో అభివృద్ధి, శ్రేయస్సు ఒకవైపు, సంఘర్షణ, హింస మరోవైపు ఉంటాయని జైశంకర్ అన్నారు. ఈ రెండింటినీ విడివిడిగా చూడలేమని పేర్కొన్నారు. ప్రపంచీకరణ, సంక్లిష్టమైన సరఫరా గొలుసులు, పరస్పరం అనుసంధానమైన మార్కెట్ల నేపథ్యంలో ఒక ప్రాంతంలో నెలకొనే అస్థిరత ఇతర ప్రాంతాలపైనా ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రపంచంలోని కొంతమంది ప్రజలు మాత్రమే శ్రేయస్సుతో జీవిస్తూ, మిగిలిన వారు లేమిలో కొనసాగితే స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదని జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం సహా ప్రపంచం ఎదుర్కొంటున్న ఉమ్మడి ముప్పులపై దేశాలు మరింత స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ, అన్ని వ్యక్తీకరణల్లోనూ ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సమాజం దృఢ సంకల్పంతో ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఆహార ప్రియులకు సరస్ రుచుల విందు

ఆదివారం కావడంతో కిటకిటలాడిన ప్రాంగణం

వివిధ రాష్ట్రాల ఎస్‌హెచ్‌జీ మహిళల ఉత్పత్తులకు ప్రోత్సాహం





విజయవాడ, మహానగర్

నగరంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా ప్రాంగణంలోని లైవ్ ఫుడ్ కోర్టు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ఆహార ప్రియులు వివిధ రకాల సంప్రదాయ వంటకాలను ఆస్వాదించారు. రుచికరమైన ఆహార పదార్థాలు, విభిన్న ప్రాంతాల వంటకాలతో లైవ్ ఫుడ్ కోర్టు సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లైవ్ ఫుడ్ కోర్టులో ఏర్పాటు చేసిన 50 ఆహార విక్రయ కేంద్రాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ప్రత్యేక వంటకాలను అందిస్తున్నారు. ఆయా రాష్ట్రాల సంప్రదాయ రుచులు, స్థానిక ప్రత్యేకతలతో కూడిన ఆహార పదార్థాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అక్కడికక్కడే వంటకాలను తయారు చేసి అందిస్తుండటంతో ఆహార ప్రియులు ఎంతో ఆసక్తిగా వాటిని ఆస్వాదిస్తున్నారు. సరస్ మేళా లైవ్ ఫుడ్ కోర్టు స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఆహార ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేసుకునేందుకు, విక్రయాలను పెంచుకునేందుకు మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. విస్తృతమైన వినియోగదారుల ఆదరణతో మహిళా సంఘాలకు ఆదాయం పెరగడంతో పాటు, వారి వంటకాలకు గుర్తింపు లభిస్తోంది. మహిళల నైపుణ్యానికి, స్వయం ఉపాధికి, ఆర్థిక స్వావలంబనకు సరస్ మేళా ఒక మంచి వేదికగా నిలుస్తోంది. రుచుల వైవిధ్యాన్ని ఆస్వాదించే అవకాశం కల్పించడంతో పాటు, మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్‌ను అందిస్తున్న సరస్ మేళా లైవ్ ఫుడ్ కోర్టు సందర్శకుల ఆదరణతో ప్రత్యేక సందడిని సంతరించుకుందని ఎన్ఐఆర్‌డీపీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ చిరంజీలాల్ కఠారియా పేర్కొన్నారు.

సరస్ మేళాలో సాంస్కృతిక శోభ





విజయవాడ, మహానగర్

నగరంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా 2026లో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు విశేష ఆదరణ లభిస్తోంది. అక్టోబర్ 24వ తేదీ నాటికి మేళాలో మొత్తం రూ.8.24 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. ఒక్కరోజులోనే రూ.1.07 కోట్ల విలువైన 82,730 ఉత్పత్తులు అమ్ముడవగా, 63 వేల మందికి పైగా సందర్శకులు మేళాను సందర్శించారు. వివిధ రాష్ట్రాల మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల కొనుగోళ్లతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలతో పాటు గోవా మహిళలు ప్రదర్శించిన సంప్రదాయ 'ఫుగ్డీ' జానపద నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంగీత వాయిద్యాలు లేకుండా మహిళలు వలయాలుగా, వరుసలుగా ఏర్పడి వేగవంతమైన పాద కదలికలు, నోటితో ప్రత్యేక శబ్దాలు చేస్తూ లయబద్ధంగా ప్రదర్శించిన ఈ నృత్యం ప్రేక్షకులను అలరించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధుల మిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మేళా గ్రామీణ మహిళా వ్యాపారవేత్తలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు, మార్కెట్ అవకాశాలను విస్తరించుకునేందుకు, ఆదాయాన్ని పెంచుకునేందుకు వేదికగా నిలుస్తోంది.

అదనపు పెన్షన్‌తో నాలుగు లక్షల మందికి ప్రయోజనం

- పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్ ఏ. విద్యాసాగర్
- హెల్త్ కార్డుల ద్వారా సంపూర్ణ వైద్య సేవలు అందించేందుకు కృషి



విజయవాడ, మహానగర్

రాష్ట్ర ప్రభుత్వానికి దశాబ్దాల పాటు సేవలందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ కృషి చేస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్ తెలిపారు. పెన్షనర్ల వయస్సు, ఆరోగ్య అవసరాలు, ఆర్థిక, సాంకేతిక సమస్యలు, పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్లకు హెల్త్ కార్డుల ద్వారా పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి రావాలని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు నాణ్యమైన వైద్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హెల్త్ కార్డుల ద్వారా అందించే వైద్య సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నేరుగా ట్రస్ట్‌కు చేరేలా చర్యలు చేపడుతున్నామని, దీనివల్ల ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులు వేగవంతమై ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. నగదు రహిత వైద్య సేవల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సుమారు నాలుగు లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అదనపు పెన్షన్ మంజూరుతో నాలుగు లక్షల మంది లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, రూ.25 వేల కోట్లకు పైగా పాత బకాయిల చెల్లింపులో ఏపీ ఎన్జీవో సంఘం కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. ఉద్యోగ సంఘంలో సభ్యులుగా పనిచేసి పదవీ విరమణ అనంతరం పెన్షనర్లుగా మారిన వారిని సంఘం తన కుటుంబ సభ్యులుగానే భావిస్తుందని, వారి సంక్షేమం, హక్కులు, పదవీ విరమణ ప్రయోజనాల సాధనకు ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు మంజూరు చేసి నగదు రహిత వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి జె. రాజారావు, ఎన్జీవో నాయకులు సత్యనారాయణ రెడ్డి, సీవీఆర్ ప్రసాద్, నజీర్, దాస్, పెన్షనర్ల సంఘ నాయకులు కె. డాలి నాయుడు, జి. నారాయణరావు, విష్ణువర్ధన్, విశ్రాంత డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు వెంకటేశ్వరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ్ శర్మ



ఇంద్రకీలాద్రి, మహానగర్

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథ్ శర్మ ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు వేదోక్తంగా ఆశీర్వచనం చేయగా, దేవస్థాన అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

జాతీయ రాజకీయాల్లోకి కేసీఆర్... కమ్ బ్యాక్ సాధ్యమేనా?

హైదరాబాద్

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి పరాజయానికి ప్రధాన కారణం తాము నడిపిన ఆర్భాటపు జాతీయ రాజకీయాలేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్వయంగా వందల సార్లు ఒప్పుకున్నారు. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు త్వరలోనే జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారి, ఢిల్లీ పీఠాన్ని శాసించే స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం రేపాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన అంబర్‌పేట్ నియోజకవర్గ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బలహీనపడుతోందని, అటు ప్రతిపక్ష కాంగ్రెస్ వైఫల్యాల వల్ల దేశంలో కాంగ్రెసేతర, బీజేపీయేతర శక్తుల అవసరం త్వరలోనే పరాకాష్టకు చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం తెలంగాణ రాష్ట్రా?నికే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలో కేసీఆర్ మళ్లీ కీలకపాత్ర పోషిస్తారని స్పష్టం చేయడం గులాబీ శ్రేణుల్లో నయా ఉత్సాహాన్ని నింపింది.టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడం వల్లే తెలంగాణ ఆత్మకు, ప్రజల మనోభావాలకు పార్టీ దూరమైందని మీడియా ముఖంగా ఎన్నోమార్లు విశ్లేషించారు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో పాత జాతీయ నినాదాలను పక్కనపెట్టి, మళ్లీ పక్కా తెలంగాణ సెంటిమెంట్‌ను తెరపైకి తెచ్చి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ ఎన్నికల్లో సైతం ఒక్క లోక్‌సభ స్థానం కూడా దక్కకపోవడంతో ప్రజలు బీఆర్ఎస్ వైఖరిని ఎంత తీవ్రంగా తిరస్కరించారో తేలిపోయింది.హైదరాబాద్‌లో జరిగిన పార్టీ అంబర్ పేట సమావేశంలో కేటీఆర్ .. మాజీ సీఎం కేసీఆర్ త్వరలోనే జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని, కాంగ్రెస్, బీజేపీయేతర కూటమిని నడిపిస్తారని చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో చేసిన మహా తప్పిదం వల్ల అధికారం పోయిందని స్వయంగా అంగీకరించిన నాయకుడే.. ఇప్పుడు అదే తప్పును మరింత బాహాటంగా సమర్థిస్తూ మాట్లాడటం ఆయన రాజకీయ పరిపక్వత లోపానికే అద్దం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోయి, అస్తిత్వ సంక్షోభం వెంటాడుతున్న తరుణంలో.. తెలంగాణ గడ్డపై పార్టీని నిలబెట్టుకోవాల్సింది పోయి, మళ్లీ ఢిల్లీ చక్రం తిప్పుతామంటూ ప్రకటనలు చేయడం తప్పు దిద్దుకోలేదనడానికి సాక్ష్యంగా కనిపిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది.అసెంబ్లీ ఎన్నికల నాటికి కేసీఆర్ కేవలం తెలంగాణకే పరిమితమైన నాయకుడిగా ఉండి, ఇక్కడి రైతాంగం, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై పూర్తి దృష్టి సారించి ఉంటే బీఆర్ఎస్ అంత ఘోరంగా ఓడిపోయేది కాదన్నది బహిరంగ రహస్యం. ప్రజలు ఆయనను తెలంగాణ బిడ్డ గా ఆదరించారే తప్ప, మహారాష్ట్ర, ఢిల్లీల్లో పర్యటించే జాతీయ నేతగా కాదన్న వాస్తవాన్ని బీఆర్ఎస్ అగ్రద్వయం గుర్తించలేకపోయింది. ప్రజలు ఇచ్చిన ఇంతటి భారీ గుణపాఠం తర్వాత కూడా మళ్లీ అదే జాతీయ రాజకీయం అనే నినాదాన్ని నెత్తికెత్తుకోవడం వల్ల బీఆర్ఎస్‌కు ఎటువంటి లాభమూ జరగకపోగా, తెలంగాణ ప్రజల్లో ఆ పార్టీపై ఉన్న కొద్దిపాటి సానుభూతి కూడా గల్లంతయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.

బిజినెస్

ఇక ఎక్స్ ద్వారా కూడా డబ్బులు పంపొచ్చు.. కొత్త ఫీచర్ ప్రకటించిన ఎలాన్ మస్క్



ఇక నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా కూడా డబ్బులు పంపించవచ్చు. ఈ మేరకు ఎక్స్ చీఫ్ ఎలాన్ మస్క్ తమ యూజర్ల కోసం ఆసక్తికరమైన ఫీచర్‌ను ప్రతిపాదించారు. ఎక్స్‌లో ఏదైనా పోస్ట్ నచ్చితే దాని కింద ఉన్న 'లైక్ బటన్'ను లాంగ్ ప్రెస్ చేయడం ద్వారా ఆ పోస్ట్ చేసిన వారికి ఒక డాలర్ పంపే సౌకర్యాన్ని తీసుకువస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ ఫీచర్ ద్వారా సులభంగా చిన్న మొత్తంలో డబ్బు పంపించుకునే అవకాశం కలుగుతుంది. ఎక్స్‌ను కేవలం సోషల్ నెట్‌వర్కింగ్ వేదికగానే కాకుండా ఫైనాన్షియల్ సర్వీసులతో కూడిన ఒక 'ఎవ్రీథింగ్ యాప్'గా మార్చాలన్న మస్క్ విస్తృత వ్యూహంలో ఈ కొత్త ఫీచర్ ఒక భాగమని తెలుస్తున్నది. ఎక్స్ మనీ ద్వారా ఒకరికి 1 డాలర్ పంపడానికి, లైక్ బటన్‌పై లాంగ్ ప్రెస్ చేసే సదుపాయాన్ని తీసుకొస్తున్నామని మస్క్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఫీచర్ ముఖ్యంగా కంటెంట్ క్రియేటర్లకు టిప్స్ ఇవ్వడానికి, వినియోగదారులకు నచ్చిన పోస్టులను ఆర్థికంగా ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఈ చెల్లింపుల ప్రక్రియ 'ఎక్స్ మనీ' ద్వారా జరుగుతుంది. ఇటీవల అమెరికాలో ప్రారంభమైన 'ఎక్స్ మనీ' సేవలు పీర్-టు-పీర్ నగదు బదిలీలకు, డిజిటల్ చెల్లింపులకు అనుమతిస్తున్నాయి. దీంతోపాటు, ఫిజికల్, డిజిటల్ లావాదేవీలకు ఉపయోగపడే 'ఎక్స్ వీసా డెబిట్ కార్డ్'ను కూడా అందిస్తున్నారు. ఈ కార్డును యాపిల్ పేకు సైతం లింక్ చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతానికి 'ఎక్స్ మనీ' సేవలు, కొత్తగా ప్రతిపాదించిన ఈ 'లైక్' బటన్ పేమెంట్ ఫీచర్ కేవలం అమెరికా మార్కెట్‌కే పరిమితం. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ పేమెంట్స్ మార్కెట్లలో ఒకటైన భారత్ సహా ఇతర దేశాల్లో ఈ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనే విషయాన్ని కంపెనీ ఇంకా స్పష్టం చేయలేదు. ఈ కొత్త ఫీచర్ అమలుకు సంబంధించిన పూర్తి వివరాలు, కాలపరిమితిని కూడా వెల్లడించాల్సి ఉంది.

జియో రీచార్జ్: 200 రోజుల ప్లాన్.. 500జీబీ డేటా!

టెలికాం రంగంలో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో.. రిలయన్స్ జియో ఎప్పటికప్పుడు తన వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక రీచార్జ్ ప్లాన్లను పరిచయం చేస్తోంది. ఇందులో భాగంగా రూ.2,025 ప్లాన్ ద్వారా డేటా, అన్‌లిమిటెడ్ కాలింగ్‌తో పాటు ఏఐ, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను కూడా అందిస్తోంది. 200 రోజుల వ్యాలిడిటీతో వచ్చే ఈ ప్లాన్‌లో రోజువారీ డేటాతో పాటు పలు అదనపు సదుపాయాలు లభిస్తాయి. ఈ ప్లాన్ రీచార్జ్ చేసుకుంటే రోజుకు 2.5+దీ హైస్పీడ్ డేటా పొందవచ్చు. 200 రోజులు కాబట్టి.. మొత్తం 500+దీ డేటా అందుబాటులో ఉంటుందన్నమాట. దీంతో పాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చు. అర్హత కలిగిన వినియోగదారులకు అన్‌లిమిటెడ్ 5జీ డేటా ప్రయోజనం కూడా లభిస్తుంది. రోజువారీ హైస్పీడ్ డేటా లిమిట్ పూర్తయిన తర్వాత ఇంటర్నెట్ వేగం 64 ఖఎజూంకు తగ్గుతుంది.

5 కంపెనీలు.. 2600 కోట్లు.. ఈ వారం ఐపీఓలు ఇవే



ఇంటర్నెట్ డెస్క్: గత వారమంతా జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓదే హవా. ఈ వారం కూడా ప్రైమరీ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. ఐదు కంపెనీలు దాదాపు రూ.2,600 కోట్ల నిధులను మార్కెట్ నుంచి సమీకరించనున్నాయి. ఇందులో ఈఏఏఏ ఇండియా అల్టర్నేటివ్స్, ఎస్ఎన్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ వంటి కంపెనీలు ఉన్నాయి. ఐపీఓ నిధులను కార్పొరేట్ అవసరాలకు, రుణాల చెల్లింపులకు కంపెనీలు వినియోగించనున్నాయి.

ఎడెల్వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన ఈఏఏఏ ఇండియా ఆల్టర్నేటివ్స్ రూ.1200 కోట్ల నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 26న సబ్‌స్క్రిప్షన్ మొదలై.. అక్టోబర్ 28న ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.1,585-1,665గా కంపెనీ నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయిస్తున్నారు. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ ఇప్పటికే రూ.360 కోట్ల నిధులను సమీకరించింది.

వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ రూ.668 కోట్ల నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 27న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 29న ముగియనుంది. ధరల శ్రేణి రూ.313-330గా కంపెనీ నిర్ణయించింది. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ.3,233 కోట్లు. రూ.150 కోట్ల విలువైన తాజా షేర్లు, 1.57 కోట్ల ఆఫర్ ఫర్ సేల్‌లో విక్రయించనున్నారు.

ఎంకే సన్స్ ఫైన్ జువెల్స్ లిమిటెడ్ రూ.275.4 కోట్ల నిధుల సమీకరణతో అక్టోబర్ 28న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 30న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.153-162గా కంపెనీ నిర్ణయించింది. 1.36 కోట్ల తాజా షేర్లు, 34 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయించనున్నారు.

బీఎల్ఎస్ పాలీమర్స్ లిమిటెడ్ రూ.255 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంలో ఐపీఓకు రానుంది. అక్టోబర్ 27న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 29న ముగియనుంది. ధరల శ్రేణి రూ.142-150గా కంపెనీ నిర్ణయించింది. 1.7 కోట్ల తాజా షేర్లు ఉన్నాయి.

బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్ లిమిటెడ్ రూ.183.1 కోట్ల ఐపీఓతో అక్టోబర్ 29న సబ్‌స్క్రిప్షన్‌కు వస్తుంది. నవంబర్ 2న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధరల శ్రేణి రూ.78-82. ఈక్విటీ షేర్లను పూర్తిగా తాజా షేర్ల రూపంలో విక్రయిస్తున్నారు.

ఎఫ్‌పీఐల విక్రయాలు.. అక్టోబర్‌లో ?48,056 కోట్ల నిధులు వెనక్కి

28న జియో కంపెనీ షేర్లు లిస్టింగ్

రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ (జేపీఎల్) షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అక్టోబర్ 28న లిస్టింగ్ కానున్నాయి.

4 లక్షల నుంచి 2 లక్షలకు.. వెండి ధర ఎందుకు తగ్గుతోంది?



ఇంటర్నెట్ డెస్క్: బంగారం, వెండి ధరలు గత కొన్ని రోజులుగా విలువను కోల్పోతున్నాయి. ఇంధన ధరలు పెరుగుతుండడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, వడ్డీ రేట్ల పెంపు వంటివి ఈ రెండు లోహాలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా వెండి గరిష్ఠాల నుంచి సగానికి పైగా పతనమై రూ.2 లక్షల దిగువకు చేరింది. వెండి ఈ ఏడాది జనవరిలో ఔన్సు 120 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో దీని ధర అప్పట్లో రూ.4 లక్షలు దాటింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు వెండి 53 డాలర్లకు పడిపోయింది. దీంతో కిలో వెండి ధర రూ.1.9 లక్షలకు చేరింది. పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా సౌదీ అరేబియాలో చోటుచేసుకుంటున్న ఇటీవలి పరిణామాల వల్ల చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ప్రస్తుతం 116 డాలర్లకు చేరుకుంది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం ముప్పు వల్ల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను దీర్ఘకాలం పాటు గరిష్ట స్థాయిలోనే ఉంచుతుందన్న అంచనాలు బలపడ్డాయి. దీనివల్ల అమెరికా డాలర్ బలపడి బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై ఒత్తిడి పడుతోంది. మరోవైపు బంగారంతో పోలిస్తే వెండిని పారిశ్రామిక అవసరాలకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే, ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల వల్ల ఆర్థిక వృద్ధి మందగిస్తుందన్న ఆందోళనలు వెండికి పారిశ్రామిక డిమాండ్ తగ్గింది. దీంతో వెండి ధర పతనం అవుతోంది.

యూట్యూబ్ ప్రీమియంతో ఎయిర్‌టెల్, జియో ప్లాన్స్ ఇవే



ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ టెలికాం కంపెనీలైన ఎయిర్‌టెల్, జియో ఎంపిక చేసిన ప్లాన్లపై యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందిస్తున్నాయి దీంతో యూట్యూబ్‌లో యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ పొందొచ్చు. యూట్యూబ్ ప్రీమియం కావాలంటే వేరేగా సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రత్యేకమైన వోచర్లను రీచార్జ్ చేసుకుంటే.. యూట్యూబ్ ప్రీమియాన్ని ఉచితంగా పొందొచ్చు. రెండు కంపెనీలూ రూ.200 డేటా వోచర్‌పై ఈ ఆఫర్‌ను అందిస్తున్నాయి. 30+దీ హై స్పీడ్ డేటా, 28 రోజుల వ్యాలిడిటీతో వస్తున్నాయి. ఈ ఆఫర్‌ను పొందాలంటే కచ్చితంగా ప్రీపెయిడ్ రీచార్జ్ కలిగి ఉండాలి. ఎయిర్‌టెల్‌లో రూ.200 డేటా వోచర్ ప్లాన్‌తో యూట్యూబ్ ప్రీమియంతో పాటు ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, జీ5, సోనీలివ్ వంటి ఇతర 18కి పైగా ఓటీటీ ప్లాట్‌ఫాంల ఉచిత యాక్సెస్ లభిస్తుంది. జియో విషయానికొస్తే.. రూ.200 డేటా వోచర్‌తో యూట్యూబ్ ప్రీమియంతో పాటు జియో టీవీ మొబైల్ యాప్ ద్వారా ప్రైమ్ వీడియో, జియోహాట్‌స్టార్, సోనీలివ్, జీ5, సన్‌ఎన్‌ఎక్స్‌టీ, లయన్‌గేట్ ప్లే, డిస్కవరీ+, ఈటీవీ విన్ వంటి ఓటీటీ ప్రయోజనాలు పొందొచ్చు. అదనంగా సినీపోలిస్ పై రూ.150 డిస్కౌంట్ అందిస్తోంది. రోజువారీ 1+దీ లేదా 1.5+దీ డేటా కలిగిన అర్హత గల ప్రీపెయిడ్ ప్లాన్‌లపై అన్‌లిమిటెడ్ 5+ డేటాను కూడా అందిస్తోంది.

భారత స్పిన్నర్ల ధాటికి జింబాబ్వే విలవిల

మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ విజయం

జింబాబ్వేతో వన్డే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు

రెండో వన్డేలో 121 పరుగుల భారీ తేడాతో విజయం

హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ అద్భుత సెంచరీలు

భారీ లక్ష్య ఛేదనలో తడబడిన జింబాబ్వే

4 వికెట్లతో చెలరేగిన వైష్ణవి శర్మ, 3 వికెట్లు తీసిన దీప్తి

జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనను కొనసాగించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (126), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (106లి) అద్భుత శతకాలతో చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు రాణించడంతో భారత్ 121 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ స్మృతి మంధాన (0), షఫాలీ వర్మ (8) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ప్రతీక రావల్ (61)తో కలిసి హర్మన్‌ప్రీత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఆ తర్వాత దీప్తి శర్మ జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలు జింబాబ్వే బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి శతకాలతో కదం తొక్కారు. దీంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. 329 పరుగుల



కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు మంచి ఆరంభమే లభించింది. 20 ఓవర్లు ముగిసేసరికి ఒక వికెట్ నష్టానికి 104 పరుగులు చేసి పోరాడే సంకేతాలు ఇచ్చింది. ముపచిక్వా (49), తిరిపానో (46) రాణించారు. అయితే, ఆ తర్వాత భారత స్పిన్నర్లు విజృంభించారు. స్పిన్ త్రయం వైష్ణవి శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి ధాటికి జింబాబ్వే బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయారు. వైష్ణవి శర్మ 4 వికెట్లతో చెలరేగగా, బ్యాటింగ్‌లో సెంచరీతో మెరిసిన దీప్తి శర్మ బౌలింగ్‌లోనూ 3 వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. దీంతో జింబాబ్వే జట్టు 48.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది.

స్పోర్ట్స్

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో పీవీ సింధు ఓటమి

టైటిల్ గెలుచుకున్న వరల్డ్ నెంబర్ వన్ అన్ సె యంగ్



ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో భారత క్రీడాకారిణి పీవీ సింధు ఓటమి పాలైంది. దక్షిణ కొరియాకు చెందిన క్రీడాకారిణి అన్ సె యంగ్ చేతిలో ఓడిపోయింది. దీంతో ఫ్రెంచ్ ఓపెన్ ఉమన్స్ సింగిల్ టైటిల్‌ను అన్ సె యంగ్ దక్కించుకుంది. ప్యారిస్‌లోని అరెనా గ్రాండ్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్‌లో సింధు.. వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ ప్లేయర్ అన్ సె యంగ్ చేతిలో ఓటమి పాలైంది. మూడు గేమ్‌లుగా గంటకుపైగా ఈ గేమ్ సాగింది. మొదటి గేమ్‌లో 16-21తో సింధు ఆధిక్యం ప్రదర్శించింది. ఒక దశలో సింధు ఆటతీరుకు యంగ్ ఆందోళనకు గురైంది. అయితే, ఆ తర్వాత యంగ్ తన పోరాట పటిమ ప్రదర్శించింది. సింధుకు ఛీటుగా దూసుకెళ్లింది. ఫలితంగా తర్వాత సాగిన రెండు గేమ్‌లలో సింధు ఇదే ఆట తీరు చూపలేకపోయింది. దీంతో తర్వాతి రెండు గేమ్‌లను 21-11, 21-12తో సింధు కోల్పోయింది. దీంతో సింధు.. టైటిల్ కోసం జరిగిన తుదిపోరులో ఓటమి పాలైంది. అన్ సె యంగ్.. ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచింది. ఈ విజయంతో అన్ సె యంగ్ వరుసగా నాలుగోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలుచుకుంది. ఇంతకుముందు సింధు-యంగ్ మధ్య 11 మ్యాచులు జరగగా.. 11సార్లు సింధు ఓటమిపాలైంది.

జెన్-జీకి ఎమ్మెస్ ధోని సూచన.. అలాంటి అలవాట్లతో ఆరోగ్యం పాడవుతుందంటూ ఆందోళన

జెన్-జీ ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై భారత మాజీ క్రికెటర్ ఎమ్మెస్ ధోని ఆందోళన వ్యక్తం చేశారు. వీటివల్ల దీర్ఘకాలికంగా వారి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. తాజాగా ఒక కార్యక్రమంలో ప్రముఖ రచయిత జావేద్ అక్తర్‌తో కలిసి ధోని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెన్-జీకి కీలక సూచన చేశారు. జెన్-జీ, జెన్-ఆల్ఫా పాటిస్తున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. వారి ఆహారపు అలవాట్లు ఆందోళనకరంగా ఉన్నాయని, మార్చుకోవాలని సూచించారు. అలాగే, శారీరక శ్రమ, మంచి ఆహారంపై దృష్టి సారించాలన్నారు. అయితే, ఇప్పటి తరంలో కొందరు గతంకంటే మెరుగైన సామాజిక, నైతిక విలువలు పాటిస్తున్నారని, ఇది హర్షణీయం అన్నారు. అలాగే, పెద్దలు కూడా ఎప్పుడూ తామే సరైన వాళ్లం అనుకోకుండా, కొత్త తరం నుంచి కూడా నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సలహా ఇచ్చారు. భారతీయులు ఎక్కువగా కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం తీసుకుంటారనే విషయంపై కూడా ధోని మాట్లాడారు. భారతీయుల జీవనశైలి, శారీరక శ్రమ కారణంగా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం మారిన రోజువారీ జీవనశైలి, ఎక్కువగా యాక్టివ్‌గా లేకపోవడం, ఒకేరకమైన ఆహారం తీసుకోవడం వంటివి ఇప్పుడు చాలా మందికి సరిపోకపోవచ్చు అన్నారు.



సాయిదుర్గ తేజ్ కొత్త సినిమాలో 'కాంతార' బ్యూటీ

అటవీ నేపథ్యంలో భారీ యాక్షన్ డ్రామా!

మెగా సుప్రీం హీరో సాయిదుర్గా తేజ్ వరుసగా విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు వైవిధ్యమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. దర్శకుడు తేజ కాకుమాను తెరకెక్కించనున్న ఈ సినిమాను నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సాయిదుర్గా తేజ్, తేజ కాకుమాను కాంబినేషన్‌లో రానున్న ఈ కొత్త సినిమా కథాంశంపై ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో అడవి నేపథ్యంలో సాగే సన్నివేశాలు, భారీ యాక్షన్ ఎపిసోడ్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే యోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, కథాంశానికి సంబంధించిన పూర్తి వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో సాయిదుర్గా తేజ్‌కు జోడీగా కన్నడ నటి సప్తమి గౌడ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ సినిమాలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే చిత్రబృందం నుంచి పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. సప్తమి గౌడ గతంలో నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అలాగే హిందీ చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'లోనూ నటించారు. కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు సాయిదుర్గా తేజ్ సరసన అవకాశం వస్తే, అది ఆమె కెరీర్‌కు మరో ముఖ్యమైన ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'పై కూడా అంచనాలు ఉన్నాయి. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

నవంబర్ 1న ఆర్‌సీ17 పూజా కార్యక్రమాలు



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ ఆర్‌సీ 17 ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, ఎట్టకేలకు మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మొదటగా దసరా పండుగ రోజునే అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ చేయాలని చిత్ర యూనిట్ భావించింది. అయితే ఆ సమయంలో ముహూర్తం సరిపడకపోవడం మరియు కొన్ని సాంప్రదాయ కారణాలరీత్యా ఈ ఓపెనింగ్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్టోబర్ చివరి వారంలో ఈ సినిమా లాంఛింగ్ ఉంటుందని మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ గతంలో హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన తేదీని అధికారికంగా రివీల్ చేశారు. వచ్చే నెల నవంబర్ 1వ తేదీన ఎంతో గ్రాండ్‌గా ఆర్‌సీ 17 పూజా కార్యక్రమాలను నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంఛింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుష్ అవుతున్నారు మరియు సోషల్ మీడియాలో ఈ అప్‌డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.

సూర్య సినిమా కోసం 'కల్ట్' టైటిల్ అడిగారు.. కానీ నేను ఇవ్వలేదు - విశ్వక్‌సేన్



టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తాజాగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కల్ట్. ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించబోయే ఒక భారీ సినిమా కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఈ 'కల్ట్' టైటిల్‌ను తమకు ఇవ్వాలని అడిగినట్లు విశ్వక్ సేన్ స్వయంగా వెల్లడించారు. తమ సినిమా కథకు మరియు నేపథ్యానికి ఈ టైటిల్ అత్యంత సరిగ్గా సరిపోతుందని వారు భావించినట్లు ఆయన తెలిపారు. అయితే, ఆ టైటిల్ తన సినిమాలోని పాత్రకు, కథాంశానికి మరింత పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని గట్టిగా నమ్మడంతో, సూర్య టీమ్ అడిగినప్పటికీ తాను ఆ టైటిల్‌ను ఇవ్వడానికి సున్నితంగా నిరాకరించినట్లు విశ్వక్ సేన్ స్పష్టం చేశారు. అయితే, అది సూర్య నటించబోయే ఏ సినిమాకు సంబంధించిన టైటిల్ అనే దానిపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ మేటర్ టాలీవుడ్ మరియు కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారగా, దీనికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.

రాముడు, సీత ప్రేమకు సంగీత రూపం

'రామాయణ' నుంచి 'రంగులు రంగులే' పాట విడుదల!



భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం నుంచి విడుదలవుతున్న ప్రతి ప్రచార చిత్రం, పాట ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో పాటగా 'రంగులు రంగులే' విడుదలైంది. శ్రీరాముడు, సీతాదేవి మధ్య ఉన్న ప్రేమానుబంధాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది. మధురమైన సంగీతం, హృద్యమైన సాహిత్యం, అందమైన దృశ్యాలతో పాటను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆయన తనదైన శైలిలో మధురమైన స్వరాలను, ఆకట్టుకునే సంగీత వాయిద్యాలను మేళవించి పాటను రూపొందించారు. గేయ రచయిత రాకేందు మౌళి అందించిన సాహిత్యం రాముడు, సీతల మధ్య ఉన్న అనుబంధాన్ని, వారి భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఉంది. రాఘవ్ కౌశిక్, వైశాలి సామంత్ తమ స్వరాలతో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. 'రంగులు రంగులే' పాటలో రాముడు, సీతల జీవిత ప్రయాణంలోని కీలక ఘట్టాలను చూపించారు. స్వయంవరంలో తొలిసారి కలుసుకోవడం, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటవడం, అయోధ్యలో కలిసి గడిపిన మధుర క్షణాలు, అరణ్యవాసానికి బయలుదేరడం వంటి సన్నివేశాలు పాటలో కనిపిస్తాయి. ఈ దృశ్యాల ద్వారా వారి ప్రేమలోని ఆప్యాయత, పరస్పర అనుబంధం, జీవితంలో ఎదురైన కీలక మలుపులను చూపించే ప్రయత్నం చేశారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. వీరిద్దరూ తెరపై కనిపించే తీరు, పాత్రలకు అనుగుణంగా వారి హావభావాలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారీ స్థాయిలో రూపొందుతున్న 'రామాయణ'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మొదటి భాగాన్ని నవంబరు 5న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. తాజాగా విడుదలైన 'రంగులు రంగులే' పాట రాముడు, సీతల ప్రేమకథను సంగీత రూపంలో ఆవిష్కరించడంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999